ప్రజాశక్తి

శుక్రవారం 27 జూన్ 2025

8 పేజీలు

విశాఖపట్నం అనకాపల్లి





సమృద్ధిగా జలాశయాలు

◆ వచ్చే నెల చివరిలో సాగునీరు విడుదల

◆ పూర్తికాని కాలువ పనులు



నిండుకుండలా తాండవ జలాశయం

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

జిల్లాలోని జలాశయాల్లో నీటి మట్టాలు సమృద్ధిగా ఉన్నాయి. ఆయకట్టుకు నీరు సరఫరా చేసే కాలువలు మాత్రం సరిగా లేవు. ప్రధాన, పిల్ల కాలువ పనులు ఇంకా పూర్తికాలేదు. గురువారం తాండవ జలాశయంలో 195, రైవాడలో 197, కోనాంలో 10, పెద్దేరు జలాశయంలో 45 క్యూసెక్కుల నీరు చేరింది. ఈ ఏడాది ఖరీఫ్‌లో 1.45 లక్షల ఎకరాల్లో వరి సాగుకానుంది. వర్షాలతో రైతులు ఆకుమడులు సిద్ధం చేస్తున్నారు. జలాశయాల్లో నీటి మట్టాలు పెరిగితే గతేడాది కంటే ముందుగానే నీరు విడిచిపెడతామని నీటిపారుదల శాఖాధికారులు చెబుతున్నారు. తాండవ కింద 32,689 ఎకరాలు, పెద్దేరు కింద 15,105 ఎకరాలు, రైవాడ కింద 15,344 ఎకరాలు, కోనాం కింద 12,276 ఎకరాల ఆయకట్టు వుంది. పెద్దేరు మినహా మిగిలిన జలాశయాలన్నింటిలోనూ గతేడాది కంటే ఈసారి నీరు ఎక్కువగా వుంది. తాండవ జలాశయ పూర్తిస్థాయి నీటి మట్టం 380 అడుగులకుగానూ గతేడాది జూన్ 26 నాటికి 357.80 అడుగుల నీరు ఉంది. ఈ ఏడాది అదే తేదీకి 367.10 అడుగులకు చేరింది. పెద్దేరులో 137 మీటర్లకు గతేడాది 136.40 మీటర్ల నీరుండగా, ఈ ఏడాది 136 మీటర్ల నీరు వుంది. రైవాడ పూర్తిస్థాయి నీటిమట్టం 114 మీటర్లకు గతేడాది 104.80 మీటర్లుండగా, ఈ ఏడాది 110.94 మీటర్లకు పెరిగింది. కోనాంలో 101.25 మీటర్లకు గతేడాది 95.60 మీటర్ల నీరువుండగా, ఈ ఏడాది 95.70 మీటర్ల నీరు నిల్వవుంది.

కాలువల సంగతేంటి ?

నీటి సరఫరాకు ఆటంకంగావున్న తుప్పలు, డొంకలు కొట్టించి కాలువల మరమ్మతులు చేపట్టేందుకు సరిపడా నిధులను ప్రభుత్వం ఇవ్వలేదు. విడిచిపెట్టిన నీరు చివరివరకూ పారేలా తాండవ, పెద్దేరు, రైవాడ, కోనాం జలాశయ కాలువలు లేవు. వచ్చే నెల రెండో వారంలోపు కొన్ని పనులు పూర్తిచేసి, చివరి వారంలో ఖరీఫ్‌లో ఉడుపులు చేసేందుకు నీటిని విడుదల చేయాలని నీటిపారుదల శాఖాధికారులు భావిస్తున్నారు. నీటి వినియోగదారుల సంఘాలు, ప్రాజెక్టు కమిటీల నుంచి ఈలోపు అభిప్రాయాలు తీసుకోనున్నారు. జలాశయాల్లో నీరు సమృద్ధిగా ఉండడంతో వీటి పరిధిలోని 75,414 ఎకరాలకు సమృద్ధిగా సాగునీరు సరఫరా చేయవచ్చని అధికారులు చెబుతున్నారు. జలాశయాల పరీవాహక ప్రాంతాల్లో వర్షాలు పడ్డంతో నీటి ప్రవాహం పెరుగుతోంది.



పాఠశాలకు నడిచి వెళ్తున్న విద్యార్థులు

బడికి వెళ్లాలంటే..
10 కిలోమీటర్లు నడవాల్సిందే !

ప్రజాశక్తి - రోలుగుంట

ఈ చిట్టిపొట్టి విద్యార్థులు సుదూర ప్రాంతంలోని బడికి రోజూ 10 కిలోమీటర్లు నడుస్తున్నారు. ఎండవానల్లో వీరి కాలినడక సాగుతున్నా ప్రభుత్వానికి పట్టడం లేదు. వివరాల్లోకి వెళ్తే.. అనకాపల్లి జిల్లా రోలుగుంట మండలం అర్ల పంచాయతీ పెద్ద గరువు గ్రామం నుండి ఎంబి.పట్నం పాఠశాలకు వెళ్లాలంటే రానుపోను పది కిలోమీటర్లు నడవాల్సిందే. పెదగరువు గ్రామంలోని ఏడుగురు, కొత్తలోసింగి, పాతలోసింగి నుంచి 13 మంది ఎంబి.పట్నం గ్రామంలోగల ఎంపిపి పాఠశాలకు అలానే నడిచివెళ్తున్నారు. గత సంవత్సరం ఉపాధ్యాయుడును లోసింగి గ్రామానికి డిప్యూటేషన్‌పై వేశారు. తర్వాత ప్రత్నామ్నాయంగా పాఠశాల ఏర్పాటు చేశారు. కొన్ని రోజుల తర్వాత స్కూల్ పని చేయలేదు. దీంతో అవస్థలు తప్పలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం లోసింగి గ్రామంలో ప్రత్యేక స్కూల్ ఏర్పాటు చేసి, ఎంబి.పట్నం ఎంపిపి స్కూల్ నుండి ఒక ఉపాధ్యాయున్ని డిప్యూటేషన్ మీద ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. లోసింగి గ్రామంలో ప్రత్యేక స్కూలు షెడ్డు నిర్మాణం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. లేనిపక్షంలో జూలై 1వ తేదీన లోసింగి గ్రామం నుండి పాదయాత్ర చేస్తామని పిల్లలు, వారి తల్లిదండ్రులు చెబుతున్నారు. ఇక్కడ అంగన్వాడీ సెంటర్‌ను కూడా ఏర్పాటు చేసి అంగన్‌వాడీ కార్యకర్తను నియమించాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు కె.గోవిందరావు, నాయకులు కిల్లో నరసయ్య, కొండతామలు కామేష్ డిమాండ్ చేశారు.

వేతన బకాయి, ఇతర సమస్యలపై 30న జివిఎంసి ముట్టడి

▶ వార్త 4లో..

అదనపు భూసేకరణ చేపట్టొద్దు

▶ వార్త 8లో..

హత్య కేసులో నిందితుడి అరెస్ట్

▶ వార్త 3లో..

పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయాలి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విఎంఆర్‌డిఎ పరిధిలో ప్రస్తుతం జరుగుతున్న ప్రాజెక్టులను సత్వరమే పూర్తి చేయాలని, నిర్మాణ పనుల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ వద్దని విఎంఆర్‌డిఎ చైర్మన్ ఎంవి.ప్రణవ్ గోపాల్ ఆదేశించారు. గురువారం ఉదయం విఎంఆర్‌డిఎకు చెందిన ఇంజినీరింగ్ విభాగపు అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పార్కుల్లో వాకర్లకు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా చూడాలని, మౌలిక సదుపాయాలు కల్పన కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. సెంట్రల్ పార్క్ ఆవరణలో కొత్తగా చేపట్టే యాంటీ డ్రగ్ పార్క్ నిర్మాణానికి అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మధ్య తరగతికి అనువుగా ఉండే ఎన్‌టిఆర్ లే అవుట్ స్థలాల గురించి విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. కార్యక్రమంలో జాయింట్ కమిషనర్ కె.రమేష్, ప్రధాన ఇంజినీర్ భవానీ శంకర్, కార్యనిర్వహాక ఇంజినీర్లు రామరాజు, సుధీర్, రాంబాబు, దుర్గా ప్రసాద్ పాల్గొన్నారు.

నేడు సూపర్ ఇసిబిసి భవనం ప్రారంభం

రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ రాక



సాగర్‌నగర్‌లో నిర్మించిన ఇసిబిసి భవనం

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

సాగర్ నగర్‌లో ఎపిఇపిడిసిఎల్ నిర్మించిన సూపర్ ఇసిబిసి (ఎనర్జి కన్జర్వేషన్ బిల్డింగ్ కోడ్) భవనాన్ని శుక్రవారం రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రారంభించనున్నారు. ఈ మేరకు అన్ని ఏర్పాట్లూ పూర్తయ్యాయని ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఎపిఇపిడిసిఎల్) సిఎమ్‌డి పృథ్వీతేజ్ ఇమ్మడి గురువారం తెలిపారు. రాష్ట్రంలోనే మొదటిసారిగా ఎపిఇపిడిసిఎల్ ఒక సవాలుగా తీసుకొని సుమారు రూ.14 కోట్ల వ్యయంతో ఈ భవనాన్ని నిర్మించిందని, దీనికి భారత ప్రభుత్వ సంస్థ బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియన్సీ 5 కోట్ల రూపాయలను ప్రోత్సాహకంగా మంజూరు చేసిందని ఆయన తెలిపారు. భవనం మొత్తం ఎనర్జీ కన్జర్వేషన్‌తో, విద్యుత్ బిల్లుల భారాన్ని గణనీయంగా తగ్గించుకోవడానికి ఒక ఉదాహరణగా నిలవనుందని పేర్కొన్నారు.

ఇపిడిసిఎల్ పరిధిలోని 11 జిల్లాల ఉద్యోగులకు ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ కోసం ఎనర్జీ కన్జర్వేషన్ బిల్డింగ్ కోడ్ నార్మ్స్‌తో నిర్మించిన ఈ భవనం జి+2 అంతస్తులతో, ఒక్కొక్క అంతస్తు 14 వేలా 4 వందల చదరపు అడుగుల విస్తీర్ణంతో నిర్మించబడిందన్నారు. ఈ భవన నిర్మాణానికి నాలుగు ప్రమాణాలు అనుసరించామని తెలిపారు. వాటిలో మొదటిది సూర్యుని వెలుతురును నియంత్రించే కిటికీల పద్ధతి, రెండోది పవర్ సేవింగ్, మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

నేడు సూపర్ ఇసిబిసి భవనం ప్రారంభం

స్టార్ రేటెడ్ ఉపకరణాలు వాడే పద్ధతి, మూడోది విఆర్‌వి ఎయిర్ కండిషన్ పద్ధతి, నాలుగోది రెన్యువబల్ ఎనర్జీ పద్ధతి అని పేర్కొన్నారు. గోడలన్నీ కావిటీ వాల్స్‌తో కట్టబడ్డాయని, అవుటర్ వాల్ 8 అంగుళాలు, ఇన్నర్ వాల్ 4 అంగుళాలు, మధ్యలో ఎయిర్ గ్యాప్ 4 అంగుళాలు మొత్తం 16 అంగుళాలు గోడల నిర్మాణంలో ట్రిపుల్ ఎసి బ్రిక్స్ ఉపయోగించడం వల్ల వేడి లోపలకు రాదని తెలిపారు. సాధారణ భవన నిర్మాణాల కిటికీలకు ఒక్క పొర ఉండే గ్లాసులు మాత్రమే వాడతారని, కానీ సూపర్ ఇసిబిసి నిర్మాణానికి మూడు పొరలు అవుటర్ గ్లాస్, 12 మిల్లీమీటర్ల మధ్యలో 6 మిల్లీమీటర్ల ఎయిర్ గ్యాప్, ఇన్నర్ గ్లాస్ 6 మిల్లీమీటర్ల మందం మొత్తంగా 24 మిల్లీమీటర్ల మందం కలిగిన గ్లాసులు వాడటం వల్ల భవనంలోకి వేడి తక్కువగా ప్రసరిస్తుందన్నారు. ఇక సీలింగ్ విషయానికి వస్తే.. 100 డెకింగ్ సీలింగ్ చేసామని, 50 మిల్లీమీటర్ల మందంగల రాక్ వుడ్‌తో స్లాబ్‌కి టచ్ అవుతూ ఒక సీలింగ్ వేసి, తర్వాత ఎయిర్ గ్యాప్ ఇచ్చి ఫాల్స్ సీలింగ్ చేసామని, దీంతో స్లాబ్ నుండి వేడి కిందకు దిగదని అన్నారు. మొత్తం భవనంలో 40 నుంచి 60 శాతం విద్యుత్ ఆదా అవుతుందన్నారు. విద్యుత్‌ను ఆదా చెయ్యడానికి ఎయిర్ కండిషన్ సిస్టం హెచ్‌వి ఎసి సిస్టంను అనుసరించామని, హీట్ వెంటిలేటివ్ ఎయిర్ కండిషన్ సిస్టమ్ పద్ధతిలో సెన్సార్ ద్వారా ఆక్యుపెన్సీ బట్టి కంప్రెసర్ ఆన్ ఆఫ్ వాల్యూం త్రో చేయడం ద్వారా విద్యుత్ ఆదా అవుతుందన్నారు. 50 కిలోవాట్ల సామర్థ్యం కలిగిన సోలార్ రూఫ్ టాప్‌ను నిర్మించామన్నారు.

ఈ భవనం గౌండ్ ఫ్లోర్‌లో ఏర్పాటు చేసిన విద్యుత్ శాఖ శిక్షణాలయంలో జూనియర్ లైన్‌మ్యాన్ నుంచి పైస్థాయి ఉద్యోగుల వరకు రకరకాల శిక్షణా కార్యక్రమాలను నిర్వహించనున్నామని తెలిపారు. విశాఖలోని సముద్ర తీర ప్రాంతంలోని 24 సబ్ స్టేషన్లను స్కాడా వ్యవస్థకు అనుసంధానిస్తూ అన్‌మెన్డ్ ఆటో స్విచింగ్ సబ్ స్టేషన్లుగా మార్చిన వాటిని మంత్రి గొట్టిపాటి సందర్శిస్తారని తెలిపారు. అదేవిధంగా సంస్థలో పనిచేస్తూ చనిపోయిన కుటుంబాల్లో అర్హులైన 19 మందికి కారుణ్య నియామక పత్రాలను అందిస్తారన్నారు.



వైద్య శిబిరానికి హాజరైన రోగులు

అల్లూరి భవనంలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో అల్లూరి ఆరోగ్య విభాగం ఆధ్వర్యంలో గురువారం ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించారు. విజ్ఞాన కేంద్రం చైర్మన్ వివిఎస్.పద్మనాభ రాజు క్యాంపును ప్రారంభించారు. శిబిరంలో బిపి, షుగర్, ఇసిజితోపాటు క్యాన్సర్ పరీక్షలు చేపట్టారు. అవసరమైన వారికి మందులను ఉచితంగా పంపిణీ చేశారు. నేత్ర పరీక్షలు నిర్వహించారు. మెడికవర్ హాస్పిటల్స్ నుంచి జనరల్ ఫిజీషియన్ డాక్టర్ శ్రవణ్, డాక్టర్ రాజు వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో అల్లూరి ఆరోగ్య విభాగం నాయకులు టి.కామేశ్వరరావు, ప్రజా ఆరోగ్య వేదిక నాయకులు ఐకె.శేషు, పిపిసి నాయకులు కళాధర్, స్రవంత్, చంద్రమౌళి పాల్గొన్నారు.

అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : నవభారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేస్తామని వైసిపి విశాఖ దక్షిణ ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ అన్నారు. ఆ పార్టీ 33వ వార్డు అధ్యక్షునిగా దళితుడైన ముత్తాబత్తుల రమేష్‌ను నియమించారు. గురువారం ఆశీలుమెట్ట కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో రమేష్ తన అనుచరులతో వచ్చి మాజీ ఎమ్మెల్యే గణేష్ కుమార్‌ను గజమాలతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా గణేష్ కుమార్ మాట్లాడుతూ మహనీయుల బాటలో నడుస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ బిసి సెల్ విశాఖ అధ్యక్షులు సనపల రవీంద్ర భరత్, నాయకులు దశమంతరావు చిన్ని, ముజీబ్ ఖాన్, భీశెట్టి ప్రసాద్, బెవరా మహేష్ పాల్గొన్నారు.

మళ్ల సురేంద్రకు సత్కారం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : అక్కినేని వంశాభిమాని మళ్ల సురేంద్ర ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన సందర్భంగా గురువారం నగరంలోని సుబ్బలక్ష్మి కల్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్రస్థాయి అక్కినేని సీనియర్ అభిమానులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అక్కినేని సీనియర్ అభిమాని నవీన్ ప్రసాద్ మాట్లాడుతూ నిత్య ప్రజా సేవకుడైన సురేంద్రను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ పదవి వరించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో అక్కినేని అభిమానులు సుబ్బారావు, నవీన్ ప్రసాద్ పాల్గొన్నారు.

వీధి విక్రయదారుల సభ్యత్వానికి దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : వీధి విక్రయదారుల నగర కమిటీ అనధికారుల సభ్యత్వం కోసం దరఖాస్తులను స్వీకరిస్తున్నట్టు జివిఎంసి జోన్– 3 జోనల్ కమిషనర్ కె.శివప్రసాద్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. వీధి విక్రయదారుల చట్టం 2014 జిఒ నెంబర్ 137 ప్రకారం జివిఎంసి వీధివిక్రయదారుల నగర కమిటీలో నలుగురు అనధికార సభ్యులను తీసుకుంటామన్నారు.

నగరాభివృద్ధి, సుందరీకరణపై దృష్టి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ నగరాభివద్ధి, నగర సుందరీకరణపై దృష్టి సారించాలని జివిఎంసి కమిషనర్ కేతన్ గార్గ్ జివిఎంసి ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన జివిఎంసి ప్రధాన కార్యాలయంలోగల సమావేశ మందిరంలో జివిఎంసి ఇంజినీరింగ్ అధికారులతో ఇంజినీరింగ్ విభాగం పనులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగరంలో జివిఎంసి ఇంజినీరింగ్ విభాగం పర్యవేక్షక ఇంజినీర్ల పరిధిలో ఎన్ని పనులు, ఎంత నిధులతో సాగాయో ఆరా తీశారు. చేపట్టబోవు పలు ప్రాజెక్టులపై సమీక్షించారు. అన్ని జోన్లలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై పూర్తిస్థాయిలో నివేదిక ఇవ్వాలని పర్యవేక్షక ఇంజనీర్లను ఆదేశించారు. అనంతరం మధురవాడలో చేపట్టబోవు భూగర్భ మురుగు నీటి పారుదల వ్యవస్థకు సంబంధించిన ప్రాజెక్టు పనులపై ఇంటర్నేషనల్ ఫైనాన్సు కార్పొరేషన్ ప్రతినిధులు, ఇంజినీరింగ్ అధికారులతో కమిషనర్ సమీక్షించారు. ఈ సమీక్ష సమావేశంలో పర్యవేక్షక ఇంజనీర్లు గోవిందరావు, కె.వి.ఎన్.రవి, పి.వి.వి సత్యనారాయణ రాజు, సంపత్ కుమార్, కె.శ్రీనివాసరావు, వై.కృష్ణారావు, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కేతన్‌గార్గ్

ఆడారి కిషోర్‌కుమార్‌కు డాక్టరేట్ ప్రదానం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఆంధ్ర విశ్వవిద్యాలయం న్యాయ కళాశాల పరిశోధక విద్యార్థి ఆడారి కిషోర్ కుమార్ దామోదరం సంజీవయ్య నేషనల్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య ప్రకాష్ రావు మార్గదర్శనంలో 'ఉమన్ ఎంపవర్మెంట్ త్రూ కాన్స్టిట్యూషనల్ అండ్ అదర్ లాస్ ఎ సోషియో లీగల్ స్టడీ ఇన్ స్పెషల్ రెఫరెన్స్ టు అనకాపల్లి డిస్ట్రిక్ట్' అనే అంశంపైన చేసిన పరిశోధనకుగాను పిహెచ్‌డి లభించింది. ఆ డిగ్రీని ఆంధ్ర విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ఆచార్య జిపి.రాజశేఖర్ తన కార్యాలయంలో కిషోర్ కుమార్‌కు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ లా కాలేజీ ప్రిన్సిపాల్ ఆచార్య కె.సీతామాణిక్యం తదితరులు పాల్గొని కిషోర్ కుమార్‌ను అభినందించారు.



ఎయు విసి నుంచి సర్టిపికెట్ అందుకుంటున్న ఆడారి కిషోర్ కుమార్

పోర్టు చైర్మన్‌ను కలిసిన జివిఎంసి కమిషనర్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ పోర్టు అథారిటీ చైర్మన్ డాక్టర్ అంగముత్తును జివిఎంసి కమిషనర్ కేతన్‌గార్గ్ విశాఖ పోర్ట్ అథారిటీ కార్యాలయంలోని ఆయన ఛాంబర్‌లో గురువారం మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందించారు.

మేలో 1.04 కోట్ల సొత్తు రికవరీ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ పోలీస్ కమిషనరేట్‌లో మే నెల రికవరీ మేళాను గురువారం ఉదయం నిర్వహించారు. ఈ సందర్భంగా మీడియా సమావేశంలో నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రాత బాగ్చి మాట్లాడారు. మే నెలలో 82 కేసులు నమోదయ్యాయని, 70 కేసులను విజయవంతంగా ఛేదించామని, 65 మందిని అరెస్టు చేశామని తెలిపారు. చోరీ కాబడిన సొత్తులో రూ.47,97,450 విలువగల వస్తువులు, నగదుతోపాటు రూ.57 లక్షల విలువగల 395 మొబైల్ ఫోన్లను కలుపుకుని మొత్తం రూ.1,04,97,450 విలువగల సొత్తును రికవరీ చేశామన్నారు. రికవరీ మేళా ద్వారా బాధితులకు ఈ సొత్తును అందజేస్తామన్నారు. మీడియా సమావేశంలో క్రైమ్ డిసిపి కె.లతా మాధురి పాల్గొన్నారు

19న విశాఖ కో-ఆపరేటివ్ బ్యాంకు ఎన్నికలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ది విశాఖపట్నం కో–ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్ పాలకవర్గం ఎన్నికలు జూలై 19న జరుగుతాయని జిల్లా కలెక్టర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎంఎన్.హరేంధిర ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఎన్నికల షెడ్యూల్ ప్రకటించారు.

సర్వీస్ రోడ్‌లో ట్రాఫిక్‌కు అంతరాయం



పెద్దపాలెం వద్ద రోడ్డుకు అడ్డంగా నిలిపిన భారీ వాహనం

ప్రజాశక్తి - ఆనందపురం: మండలంలోని పెద్దపాలెం సర్వీస్ రోడ్‌లో గురువారం మధ్యాహ్నం ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. టాటా మోటార్స్‌కు వచ్చిన భారీ వాహనాన్ని రోడ్డులో నిలపడం వల్ల వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో తగరపువలస, ఆనందపురం మార్గంలో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయి,వాహనదారులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. ఈ సర్వీస్ రోడ్డు వెంబడి అనేక షాపులు, ముఖ్యంగా టైర్ షాపులు, టాటా మోటార్స్ సర్వీస్ సెంటర్, దాబాలు, హోటల్స్ ఉండడంతో అడ్డదిడ్డంగా వాహనాలను నిలిపేయడంపై ఆందోళన వ్యక్తమౌతోంది. దీనిపై ట్రాఫిక్ పోలీసులు తగు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

మూగజీవాలకు టీకాలు

ప్రజాశక్తి -పద్మనాభం: మండలంలోని పలు గ్రామాల్లో మూగజీవులకు టీకాలు వేసే కార్యక్రమం చేపట్టారు .గురువారం మండల పశువైద్యాధికారి డాక్టర్ మహేష్ ఆధ్వర్యంలో కృష్ణాపురంలో లో 256 మేకలకు గొర్రెలకు టీకాలు వేశారు. వచ్చేనెల 10వరకు కొనసాగే కార్యక్రమాన్ని పాడిరైతులు, జీవాల పెంపకందారులు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ మహేష్ సూచించారు.

ముగ్గురు వ్యక్తుల అదృశ్యం



పి.అప్పారావు

ప్రజాశక్తి-మధురవాడ : పిఎం పాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇద్దరు వ్యక్తులు, సంగివలసలో వివాహిత అదృశ్యమైనట్లు అందిన ఫిర్యాదుల మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నన్నారు. పిఎం.పాలెం సిఐ జి. బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం చేపలు అమ్మకంతో జీవనం సాగిస్తున్న ఆరోవార్డు ఆర్‌హెచ్ కాలానికి చెందిన పి. అప్పారావు ఈ నెల 21న ఇంటి నుంచి బయటకు వెళ్లిన అప్పారావు తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు చుట్టూ ప్రక్కలా, బంధువులు ఇళ్లల్లో వెతికినా ఆచూకీ దొరకకపోవడంతో అప్పారావు భార్య పార్వతి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎఎస్ఐ శ్యాంప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారన్నారు.



బి.మణికుమార్

అలాగే ఇదే వార్డు పరిధిలోని లక్ష్మీవానిపాలెం, బేతని స్కూల్ వెనక ఎస్‌బిఐ కాలనీకి చెందిన పెయింటర్ బి. మణికుమార్ ఈనెల 22 నుంచి కనిపించడం లేదు. ఇంటి నుంచి బయటకు వెళ్లిన మణికుమార్ కోసం వెతికినా ఫలితం లేకపోవడంతో అతని తండ్రి బి.శ్రీరాములు పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తగరపువలస : జివిఎంసి రెండో వార్డు సంగివలసలో నివసిస్తున్న కరుటూరి రామతులసి అనే వివాహిత బుధవారం తెల్లవారుజామున అదృశ్యమైనట్లు ఫిర్యాదు అందిందని సిఐ బి.తిరుమలరావు తెలిపారు. వివరాలివి.

చిప్పాడ దివీస్‌లో జూనియర్ ఆఫీసర్‌గా సురేష్‌కుమార్, సీనియర్ ఆఫీసర్‌గా అతని భార్య రామ తులసి పని చేస్తున్నారు. ఈనెల 26న తెల్లవారుజామున 3.10 గంటలకు మెలకువ చూసే సరికి తన భార్య ఇంట్లో కనిపించలేదని భర్త సురేష్‌కుమార్ ఫిర్యాదు చేశారు. అదృశ్యమైన అరగంట తర్వాత తన భార్య ఫోన్ నుంచి మెసేజ్ వచ్చిందని, తన గురించి వెతకొద్దు, కొన్ని సమస్యల వల్ల వెళ్ళిపోతున్నానని మెసేజ్‌లో పేర్కొన్నట్లు తెలిపారు. అందిన ఫిర్యాదు మేరకు ఎఎస్ఐ ఎన్.శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.వీరికి ఇద్దరు కుమారులు శరత్, సత్య కిరణ్ ఉన్నారు

మోడీ పాలనలో అప్రకటిత ఎమర్జెన్సీ

సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యాన సదస్సులో వక్తలు



సదస్సులో మాట్లాడుతున్న ప్రసాద్

ప్రజాశక్తి-సీతమ్మధార : అప్పట్లో ఇందిరాగాంధీ ప్రభుత్వం దేశంలో ఎమర్జెన్సీని ప్రకటిస్తే, నేడు మోడీ పాలనలో దేశంలో అనధికారిక ఎమర్జెన్సీ అమలు జరుగుతోందని సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర అధికార ప్రతినిధి పి ప్రసాద్ విమర్శించారు. ఎమర్జెన్సీ డే సందర్భంగా మనువాద కార్పొరేట్ ఫాసిజానికి వ్యతిరేకంగా న్యూడెమోక్రసీ విశాఖ, విజయనగరం జిల్లాల ఏరియా కమిటీ ఆధ్వర్యంలో గురువారం స్థానిక పౌర గ్రంథాలయంలో నిర్వహించిన సదస్సులో ప్రసాద్ మాట్లాడుతూ, ఆర్‌ఎస్ఎస్, కార్పొరేట్ శక్తులు మోడీని గుప్పిట్లో పెట్టుకుని దేశంలో రాజకీయ నియంతృత్వం పాలన సాగిస్తున్నారన్నారు.. ఆదివాసీలను దళితులను ముస్లింలను మైనార్టీలను తప్పు దోవ పట్టించి, రెచ్చగొట్టే విధంగా ప్రమాదకర ఎజెండాను బిజెపి ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. నాటి ఎమర్జెన్సీ కన్నా, నేటి అనధికార ఎమర్జెన్సీ దేశానికి ప్రమాదకరమన్నారు. మానవ హక్కుల వేదిక తెలుగు రాష్ట్రాల సమన్వయకర్త వివిఎస్.కృష్ణ మాట్లాడుతూ, ఎమర్జెన్సీలో రాజ్యాంగాన్ని పాతర వేశారని ఆరోపిస్తున్న బిజెపి, మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఏకంగా రాజ్యాంగాన్ని ధ్వంసం చేస్తున్నారని దుయ్యబట్టారు. సత్యాలను రాయలేకపోవడాన్ని పక్కనబెడితే, వాస్తవాలను వక్రీకరిస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న మీడియా నేడు కార్పొరేట్ శక్తుల చేతుల్లోకి వెళ్లిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు..భారత నాస్తిక సమాజం రాష్ట్ర అధ్యక్షులు టి.శ్రీరామ్మూర్తి మాట్లాడుతూ ప్రజా సమస్యలపై, మైనింగ్ తవ్వకాలపై ఉద్యమిస్తున్న 550 మంది ఆదివాసీలను, మావోయిస్టులను ఆపరేషన్ కగార్

పెద్ద చెరువులో వ్యర్థాల తొలగింపు



చెరువులో వ్యర్థాలు తొలగిస్తున్న మత్స్యకారులు

ప్రజాశక్తి -తగరపువలస : చిట్టివలస పెద్దచెరువులో వ్యర్థాలను సాంప్రదాయ మత్స్యకారులు గురువారం తొలగించారు. భీమిలి మండలం తాటితూరు స్వదేశీయ మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఆధ్వర్యంలో సంఘ సభ్యులు, మత్స్య కారులు వ్యర్థాలను తొలగింపులో పాల్గొన్నారు. ప్రభుత్వ ఉత్తర్వులను అనుసరిస్తూ మత్స్యశాఖ సూచనల మేరకున్నేళ్లుగా ఇదే చెరువులో చేపల పెంపకం ద్వారా దాదాపు వంద కుటుంబాలు జీవిస్తున్నట్లు సంఘం బోర్డు ఆఫ్ డైరెక్టర్లు ఆబోతుల నాగేశ్వరరావు, సిద్ధాంతపు రవి తెలిపారు. చెరువు చుట్టూరా ఉన్న వివిధ అపార్ట్మెంట్లు, నివాసాలు, ఆసుపత్రుల ద్వారా వాడుక నీరు, ఇతరత్రా వ్యర్థాలతో కూడిన మురుగు నీరు చెరువును అనుసంధానిస్తూ తాత్కాలికంగా తవ్విన మట్టి కాల్వ ద్వారా చెరువుకు మళ్లిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాక చెరువుకు తూర్పున ఉన్న పలు మదుములు కొందరు కప్పేయడం వల్ల చెరువులో మురుగునీరు నిల్వ ఉంటోందన్నారు. చెరువు సుందరీకరణ పనులు ఆదినుంచీ అసంపూర్తిగానే ఉంటున్నాయని, దీంతో చెరువు గర్భం విస్తీర్ణంతోపాటు మత్స్యసంపద దిగుబడి కూడా క్రమేణా తగ్గుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ చెరువులో చేపల పెంపకం ద్వారా జీవనం సాగిస్తున్న సాంప్రదాయ మత్స్యకార కుటుంబాలకు ఇబ్బందులు లేకుండా, అలాగే చెరువులో వ్యర్థాలు కలవకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

కేర్‌లో క్లిష్టమైన అన్యూరిజం ఆపరేషన్



వివరాలు వెల్లడిస్తున్న కేర్ వైద్యులు

ప్రజాశక్తి - ఆరిలోవ: అనూరిజం వ్యాధితో బాధపడుతున్న ఓ రోజుకూలీ ప్రాణాన్ని క్లిష్టమైన శస్త్రచికిత్స ద్వారా కేర్ హాస్పిటల్స్ వైద్య బృందం విజయవంతంగా కాపాడింది. గురువారం ఆరిలోవ కేర్ ఆసుపత్రిలో మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు జొన్నాడ నల్లెంశెట్టి (49), అనే వ్యక్తి ఏడాదిగా ఊపిరి పీల్చడంలో ఇబ్బంది, కడుపునొప్పి, దగ్గులో రక్తం వంటి సమస్యలతో బాధపడుతూ చికిత్స కోసం ఇటీవల కేర్ హాస్పిటల్‌ను ఆశ్రయించారన్నారు. సీటీ ఆర్టోగ్రామ్ పరీక్షలో గుండెకు దగ్గరగా ఉన్న ఒక ప్రధాన రక్తనాళంలో బెలూన్ లాంటి వాపు (అనూరిజం), దాని చుట్టూ కొంత రక్తస్రావం, ఊపిరితిత్తుల స్కాన్‌లో ఇన్ఫెక్షన్, వాయుమార్గాల్లో మలినాలు, రక్తం గడ్డకట్టినట్టు వైద్యులు నిర్ధారించారు. ప్రాణాపాయ క్లిష్ట పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని కార్డియోపల్మనరీ బైపాస్ సహాయంతో అనూరిజం సర్జరీ చేశామని కార్డియాలజిస్టులు డాక్టర్ రేవంత్, డాక్టర్ విజయ్ తెలిపారు. శస్త్రచికిత్స తర్వాత రోగికి అకస్మాత్తుగా మూర్ఛ రాగా, కేర్ న్యూరాలజీ వైద్యులు చికిత్సతో నాడీ సంబంధిత లక్షణాలు మెరుగయ్యాయన్నారు.. కార్డియోథొరాసిక్ సర్జరీ, పల్మనాలజీ, న్యూరాలజీ అనస్థీషియా, ఐసీయూ విభాగాల మధ్య సమన్వయం వల్లే ఈ విజయం సాధ్యమైందని డాక్టర్లు తెలిపారు. ఈ రకమైన అనూరిజమ్స్ చాలా అరుదైనవని తక్కువ సమయంలో గుర్తించి చికిత్స చేయకపోతే ప్రాణానికి ముప్పు వస్తుందన్నారు. అవసరమైన ప్రతివారికి మంచి ఆరోగ్య సంరక్షణ అందించాలనే నిబద్ధతను తమ ఆసుపత్రి మరోసారి రుజువు చేసిందని కేర్ ఆసుపత్రి చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ మయుక్ చౌదరి అన్నారు. సామాజిక ఆర్థిక పరమైన పరిమితులు లేకుండా అందరికి చికిత్స అందించడమే లక్ష్యంగా కేర్ పనిచేస్తోందన్నారు.

వైసిపి మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పద్మావతి

ప్రజాశక్తి-మధురవాడ : వైసిపి మహిళా విభాగం రాష్ట్ర మహిళా విభాగం ప్రధాన కార్యదర్శిగా బెందాళం పద్మావతిని పార్టీ అధిష్ఠానం నియమించింది.పార్టీలో చురుగ్గా పనిచేస్తూ, అందరికి సుపరిచితురాలైన పద్మావతి, గతంలోనూ వైసిపి మహిళా విభాగం జోనల్ ఇన్‌ఛార్జిగా పనిచేశారు.తన సేవలను గుర్తించి, పార్టీ రాష్ట్ర మహిళా విభాగంలో చోటుకల్పించిన అధినేత జగన్మోహనరెడ్డిని మళ్లీ సిఎంను చేసేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. పార్టీ అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానన్నారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు చిత్తశుద్ధితో పనిచేస్తానన్నారు

నేరాలు ఘోరాలు

హత్య కేసులో నిందితుడి అరెస్ట్

ప్రజాశక్తి-గాజువాక : పెదగంట్యాడ ఆటోనగర్‌లో యువకుడిని హత్య చేసిన ఘటనలో అతని స్నేహితుడిని నిందితుడిగా నిర్ధారించి, న్యూపోర్టు పోలీసులు అరెస్ట్ చేశారు. గురువారం న్యూపోర్టు పోలీస్‌స్టేషన్‌లో మీడియా సమావేశంలో సౌత్ ఎసిపి త్రినాథ్ వివరాలను వెల్లడించారు. ఛత్తీస్‌గఢ్ జగదల్పూర్‌కు చెందిన హతుడు మహదేవ్ (25), నిందితుడు నరేష్ ఆటోనగర్ స్టీల్‌యార్డులో కూలీలుగా పనిచేస్తూ, అద్దింట్లో నివాసముంటున్నారు. ఈనెల 22న సాయంత్రం మద్యం మత్తులో స్నేహితులిద్దరి మధ్య వాగ్వాదం రేగింది. ఈ నేపథ్యంలో మహదేవ్ తలపై కర్రతో నరేష్ బలంగా కొట్టడంతో మహదేవ్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు.. మహదేవ్ మృతదేహాన్ని దగ్గర్లో ఉన్న పొదల్లో పడేసి, నరేష్ పరారయ్యారు. నగర పోలీస్ కమిషనర్ ఆదేశాలతో రెండు బృందాలుగా ఏర్పడిన పోలీసులు గాలింపు చర్యలు చేపట్టి, ఆటోనగర్‌లో నిందితుడిని పట్టుకుని అరెస్ట్ చేసినట్లు ఎసిపి తెలిపారు. నిందితుడిపై ఛత్తీస్‌గఢ్ ఉమర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మరో హత్య కేసు నమోదై ఉందన్నారు.

1.6 లీటర్ల లిక్విడ్ గంజాయి స్వాధీనం

- నలుగురు నిందితుల అరెస్ట్

ప్రజాశక్తి- పెందుర్తి : స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలోని ఫ్లైఓవర్ దగ్గర వాహన తనిఖీలు చేస్తుండగా 1.6 లీటర్ల లిక్విడ్ పట్టుబడిందని సిఐ సతీష్ కుమార్ తెలిపారు. గురువారం మీడియా సమావేశం వివరాలను వెల్లడించారు. ఈ నెల 25న ముందస్తుగా అందిన సమాచారంతో తనిఖీలు నిర్వహించగా, అల్లూరి జిల్లాకు చెందిన చిన్ననాయుడు, సోమేష్ కుమార్, ప్రసాద్ రావు, మచిలీ నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారించామని తెలిపారు. వారి వద్ద నుండి 1.6 లీటర్ల లిక్విడ్ గంజాయి, మోటార్ సైకిల్, నాలుగు సెల్ ఫోన్లు, రూ.మూడు వేల నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. పట్టుబడిన గంజాయివిలువ రూ.1.50లక్షలు ఉంటుందన్నారు. నలుగురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

రెండు కిలోల గంజాయి పట్టివేత

ప్రజాశక్తి-గొలుగొండ:అక్రమంగా తరలిస్తున్న 2 కేజీల గంజాయితో ఇద్దరిని అరెస్టు చేసినట్లు గొలుగొండ ఎస్సై పి.రామారావు తెలిపారు. గురువారం మండలంలోని చిట్టింపాడు జంక్షన్ వద్ద చింతపల్లి నుండి మర్రిపాలెం మీదుగా వస్తున్న స్కూటీని తనిఖీ చేశామన్నారు. ఈ స్కూటీ డిక్కిలో ఈ గంజాయి పట్టుబడిందన్నారు. దీంతో చింతపల్లికి చెందిన యాకోబు, తాంబేలు లక్ష్మీలను అరెస్టు చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో సిబ్బంది పాల్గొన్నారు.

బైక్ అదుపు తప్పి ఎఎన్ఎంకు గాయాలు

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని పప్పుశెట్టిపాలెం సచివాలయ ఏఎన్ఎం రామలక్ష్మీ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. గురువారం విధులకు హాజరయ్యేందుకు నర్సీపట్నం నుండి పప్పుశెట్టిపాలెం వస్తుండగా చీడిగుమ్మల ప్రాంతంలో ద్విచక్ర వాహనం అదుపు తప్పి కింద పడ్డారు. దీంతో, ఆమె తీవ్రంగా గాయపడటంతో తోటి సిబ్బంది ఆమెను ఆసుపత్రికి తరలించారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



ప్రజాశక్తి - ములగాడ : ఐఎన్ఎస్ సర్కార్ ఫుట్‌పాత్‌పై గురువారం ఉదయం గుర్తుతెలియని మృతదేహం లభ్యమైంది. మల్కాపురం పోలీసులు తెలిపిన వివరాలివి. మల్కాపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఐఎన్ఎస్ సర్కార్ ఫుట్‌పాత్‌పై గురువారం ఉదయాన్నే అటుగా వెళ్లే పాదచారులు, వాహనదారులు గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం పడి ఉండడాన్ని గమనించి మల్కాపురం పోలీసులకు సమాచారాన్ని అందజేశారు. సంఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు మృతుడు ఎవరనేదానిపై ఆరా తీసినా ఎటువంటి సమాచారం లభ్యం కాకపోవడంతో గుర్తుతెలియని వ్యక్తిగా నిర్ధారణకు వచ్చి, మృతదేహాన్ని కెజిహెచ్‌కు తరలించారు. మల్కాపురం సిఐ గొలగాని అప్పారావు ఆధ్వర్యంలో కేసును దర్యాప్తు చేస్తున్నారు. మృతుని ఆచూకీ తెలిసిన వారు పోలీసులకు సమాచారమివ్వాలని కోరారు.

'కన్నప్ప చిత్రం చరిత్ర సృష్టిస్తుంది'



మాట్లాడుతున్న మంచు ఫ్యామిలీ అభిమానులు

ప్రజాశక్తి -గాజువాక : విలక్షణ నటుడు మోహన్‌బాబు కుమారుడు మంచు విష్ణు హీరోగా రూ. 300కోట్ల భారీ వ్యయంతో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కించిన 'కన్నప్ప'చిత్రం చరిత్ర సృష్టించడం ఖాయమని మంచు అభిమానులు ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం కన్నప్ప చిత్రం విడుదల సందర్భంగా గాజువాక శ్రీకన్య థియేటర్లో మోహన్‌బాబు, విష్ణు అభిమానులు సందడి చేశారు. ఈ సందర్భంగా జి.రాంబాబు మాట్లాడుతూ, కన్నప్ప చిత్రంలో మోహన్‌బాబుతోపాటు ప్రభాస్, మళయాళ సూపర్‌స్టార్ మోహన్‌లాల్ ప్రధాన పాత్రలు పోషించారన్నారు. కన్నప్ప చిత్రం అద్భుత దృశ్య కావ్యంగా నిలిచిపోతుందని, ప్రేక్షకులకు సెల్యులాయిడ్ విందు అందిస్తుందన్నారు. మరో అభిమాని బి .త్రిమూర్తులు మాట్లాడుతూ, అనేక వ్యయ ప్రయాసలకోర్చి నిర్మించిన కన్నప్ప చిత్రాన్ని థియేటర్లలో చూసి విజయవంతం చేయాలని కోరారు. మంచు ఫ్యామిలీ అభిమానులు జి..మనోజ్‌కుమార్, ఆర్ .నాయుడు, బాలాజీ, లీలా ప్రసాద్, వర్షిత్ పాల్గొన్నారు..

జివిఎంసి కమిషనర్‌ను కలిసిన జియ్యాని



కమిషనర్‌ను అభినందిస్తున్న జియ్యాని శ్రీధర్

ప్రజాశక్తి- వేపగుంట : జివిఎంసి కొత్త కమిషనర్ కేతన్‌గార్గ్‌ను గురువారం మాజీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. పలు సమస్యలపై మాట్లాడారు. 52వ వార్డులో పార్కులు, గ్రీన్ బెల్ట్, ఇతన అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని వినతిపత్రం అందజేశారు.

దివీస్ నిధులతో పశువైద్యకేంద్ర భవనం

• శరవేగంగా సాగుతున్న నిర్మాణ పనులు



నిర్మాణంలో ఉన్న పశువైద్య కేంద్ర భవనం

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం మండల కార్యాలయాల సముదాయం సమీపంలో కొత్త పశు వైద్య కేంద్ర భవన నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. ఇప్పటివరకు శిథిలావస్థలో ఉన్న పాత భవనం స్థానంలో, నూతన భవనాన్ని నిర్మించేందుకు ప్రముఖ ఫార్మా కంపెనీ దివిస్ లేబరేటరీ స్పందించి, సిఎస్ఆర్ నిధులను సమకూర్చింది. ఈ మేరకు రూ. 38,78,059 మంజూరు చేయగా, పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం పశువైద్యశాలను వేములవలస పాత సచివాలయం భవనంలో తాత్కాలికంగా నిర్వహిస్తున్నారు.

ఆనందపురం పశువైద్యాధికారిగా ఇటీవలఉద్యోగ బాధ్యతలు చేపట్టిన డాక్టర్ సంతష్‌కుమార్ మాట్లాడుతూ దివీస్ లేబరేటరీ సమకూర్చిన సిఎస్ఆర్ నిధులతో మూడు నెలల వ్యవధిలో నూతన భవన నిర్మాణాన్ని పూర్తిచేయడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. మండలంలోని గ్రామాల్లో పశు వైద్య సేవలను మరింత విస్తృతంగా అందించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు.

వేతన బకాయి, ఇతర సమస్యలపై

30న జివిఎంసి ముట్టడి

• పలు వార్డుల్లో సిఐటియు ఆధ్వర్యాన మున్సిపల్ కాంట్రాక్టు కార్మికుల నిరసన



సిఐటియు ఆధ్వర్యాన ఆందోళన చేస్తున్న మున్సిపల్ కార్మికులు

ప్రజాశక్తి-మధురవాడ : రెండు నెలల వేతన బకాయి చెల్లింపు, తల్లికి వందనం వంటి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వర్తింపజేయాలని కోరుతూ ఈనెల 30న జివిఎంసి ప్రధాన కార్యాలయం ముట్టడించనున్నట్లు సిఐటియు మధురవాడ జోన్ కమిటీ అధ్యక్షుడు డి.అప్పలరాజు వెల్లడించారు. రెండు నెలలుగా వేతనాలు చెల్లించకపోవడాన్ని నిరసిస్తూ జివిఎంసి ఐదో వార్డు నుంచి ఎనిమిదో వార్డు వరకు ఆయా వార్డు కార్యాలయాల వద్ద గురువారం సిఐటియు ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. రెండో జోన్ కార్యాలయం వద్ద ఆందోళనలో అప్పలరాజు మాట్లాడుతూ, పెరిగిన ధరాభారం, విద్యాసంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో పిల్లల ఫీజుల చెల్లింపు, ఇతర అవసరాలతోపాటు నిత్యజీవనానికి వేతనాలు అందకపోవడంతో కాంట్రాక్టు కార్మికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అరకొర వేతనాలతో కుటుంబపోషణ ఇబ్బందిగా ఉన్న పరిస్థితుల్లో వాటిని సక్రమంగా ఇవ్వకపోవడం సరికాదని ప్రశ్నించారు. అలాగే తల్లికివందనం, ఇతరత్రా సంక్షేమ పథకాలను కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ కార్మికులకు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. అవుట్‌సోర్సింగ్ కార్మికుల వేతనబకాయి, ఇతర సమస్యలపై ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరుతూ జివిఎంసి ముట్టడిని జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో బి నరసింగరావు, టి. జాన్, బాలకృష్ణ, కె.అచియ్యమ్మ, ఎం రమణ, ఆర్ కొండమ్మ, బి దుర్గ, సురేష్ పాల్గొన్నారు.

దోబీఘాట్ ఆక్రమణలను తొలగించాలి

• ఎపి రజక వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి ఈశ్వరరావు



మాట్లాడుతున్న ఈశ్వరరావు

ప్రజాశక్తి- సీతమ్మధార/ విశాఖ కలెక్టరేట్ : సీతమ్మపేటలోని దోబీఘాట్ స్థలాన్ని ఆదిత్య పాఠశాల పార్కింగ్, నేమ్‌బోర్డుల కోసం ఆక్రమించుకోవాలని చూస్తోందని, వీటిని తొలగించాలని ఎపి రజక వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి ఎం. ఈశ్వరరావు డిమాండ్ చేశారు .గురువారం రాజేంద్రనగర్‌లో ఎం అప్పారావు అధ్యక్షతన జరిగిన లోకమాత రజక సంఘం సమావేశంలో మాట్లాడుతూ,సీతమ్మపేట దోబీఘాట్‌లో 25 మంది రజకులు కొన్నేళ్లుగా వృత్తి పనిచేస్తున్నారన్నారు. సొంతిళ్లు లేని పరిస్థితుల్లో దోబీఘాట్‌లోనే లాండ్రీలు చేస్తూ జీవిస్తున్నారన్నారు. హుదూద్ తుఫాన్‌కు దోభీఘాట్ పాడైన నేపథ్యంలో పునర్నిర్మాణానికి రూ. 20లక్షల గ్రాంటు వచ్చిందని ఉన్న ఘాట్‌లను తొలగించి, నేటికీ పనులు చేపట్టలేదన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో దోభీఘాట్ స్థలాన్ని ఆక్రమించుకునేందుకు ఆదిత్య స్కూల్ యాజమాన్యం సిమెంట్ బల్లలు, మంచినీటి గొట్టాలను రాత్రి వేళ జెసిబితో తొలగించారన్నారు. దీనిపై అధికారులు స్పందించి ఆదిత్య యాజమాన్యంపై తగు చర్యలు తీసుకోవాలని కోరారు. దోభీఘాట్‌లో రజక వృత్తిదారులకు స్థిరనివాసాలు ఏర్పాటు చేసి, సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఎస్.ఈశ్వరరావు, ఎం.అప్పారావు, ఆర్. పోలయ్య, సిహెచ్.నాగమణి, జె.లక్ష్మి, ఆర్.కృష్ణ,పి. సోములు, కె.నాగమణి, ఎ. గౌరీ, టి.నాగమణి పాల్గొన్నారు.

అవయవదానంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

• జీవన్‌దాన్ రాష్ట్ర కోఆర్డినేటర్ డాక్టర్ రాంబాబు



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ రాంబాబు

ప్రజాశక్తి - ఆరిలోవ : అవయవ దానంపై ప్రజలను ప్రోత్సహించడం, అవగాహన కల్పించడంపై అన్ని ప్రభుత్వ, ప్రయివేటు ఆసుపత్రులు ప్రత్యేక దృష్టి సారించాలని జీవనదాన్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కోఆర్డినేటర్, విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు సూచించారు. గురువారం విశాఖ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ నందు జీవన్‌దాన్ ఈస్ట్ జోన్ జిల్లాల ప్రభుత్వ ప్రైవేటు ఆసుపత్రుల అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా జీవన్‌దాన్ కింద 73 ఆసుపత్రులు నమోదు చేసుకున్నారని, అయితే వాటిలో 50 శాతం ఆస్పత్రుల్లో ఒక్క బ్రెయిన్ డెడ్ కేసు కూడా ప్రకటించకపోవడం ఆలోచించవలసిన అంశం అన్నారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు ప్రతి ఆసుపత్రిలో అవయవ దానంపై అవగాహన కల్పిస్తూ బోర్డులు, హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలని సూచించారు.. అవయవాలు స్వీకరించేందుకు వైద్య బృందం లేకపోయినా బ్రెయిన్ డెడ్ అయినట్లు ప్రకటించి తమ దృష్టికి తీసుకొస్తే, అవయవాలు స్వీకరించేందుకు వైద్య బృందాన్ని పంపిస్తామన్నారు అతి తక్కువ విభాగాలతో ఉన్న విమ్స్ ఆస్పత్రిలో మూడు బ్రెయిన్ డెడ్ కేసులను ప్రకటించి అవయవాలను స్వీకరించి రాష్ట్ర ప్రభుత్వ ఆరోగ్య రంగంలో సరికొత్త చరిత్ర సష్టించామన్నారు.. విమ్స్ ఆస్పత్రి స్ఫూర్తితో రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రిలో కూడా బ్రెయిన్ డెడ్ రోగులను ప్రకటించి వారి కుటుంబాల చేత అవయవ దానం చేసేలా అవగాహన కల్పించాలని సూచించారు.. అవయవ దానం చేసే రోగికి రాష్ట్ర ప్రభుత్వం అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించటంతో పాటు పదివేల రూపాయలు అంత్యక్రియ ఖర్చులు నిమిత్తం ఇస్తుందన్నారు. అవయవ దానంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి ప్రోత్సహిస్తుందన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు కూడా సహకరించాలని సూచించారు. అన్ని ఆసుపత్రుల్లో అవయవ దానం కోసం కోఆర్డినేటర్లను ఏర్పాటు చేసుకోవాలన్నారు.. మానవతా, సేవా దృక్పథంతో ఆలోచిస్తే విజయవంత మౌతుందన్నారు. ఈ సందర్భంగా ఆసుపత్రుల అధికారులకు ఉన్న సందేహాలు నివృత్తి చేయడంతో పాటు వారి సలహాలు సూచనలను రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళతామన్నారు.

గీతం బిఎస్‌సి, ఎంఎస్‌సి స్పాట్ అడ్మిషన్లు

ప్రజాశక్తి-మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ సైన్స్ ద్వారా నిర్వహిస్తున్న బిఎస్‌సి, ఎంఎస్‌షి కోర్సులలో ప్రవేశానికి స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.వేదవతి తెలిపారు.గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ ద్వారా బయోకెమిస్ట్రీ, బయోటెక్నాలజీ, కెమిస్ట్రీ, ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్ సైన్స్ విత్ కాగ్నిటివ్ సిస్టమ్స్, మైక్రోబయాలజీ, ఫిజిక్స్, మేథ్స్, స్టాటిస్టిక్స్, ఫుడ్‌సైన్స్ అండ్ టెక్నాలజీ ఇంకా ఎన్విరాన్‌మెంటల్ సైన్స్‌లలో నాలుగేళ్ల బిఎస్సీ(ఆనర్స్) కోర్సులు, మూడేళ్ల బిసిఎ కోర్సు నిర్వహిస్తున్నామని తెలిపారు. అలాగే అప్లైడ్ మేథ్స్, బయోకెమిస్ట్రీ అండ్ మాలిక్యులర్ బయాలజీ, డేటా సైన్స్, బయోకెమిస్ట్రీ, బయోటెక్నాలజీ, కెమిస్ట్రీ, ఎలక్ట్రానిక్స్, మైక్రోబయాలజీ, ఫిజిక్స్, స్టాటిస్టిక్స్, ఫుడ్‌సైన్స్ అండ్ టెక్నాలజీ, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్‌లలో రెండేళ్ల ఎమ్మెస్సీ కోర్సులను నిర్వహిస్తున్నామన్నారు. వీటితో పాటు మాస్టర్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్స్ (ఎంసిఎ) కోర్సు నిర్వహిస్తున్నామని తెలిపారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా బిఎస్సీ, ఎమ్మెస్సీ కోర్సులను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కోర్సులలో ప్రవేశానికి వివరాల కోసం గీతం వెబ్‌సైట్ www.gitam.edu ను సంప్రదించవచ్చునన్నారు. ప్రతిభ గల విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను అందిస్తున్నట్లు వెల్లడించారు.

ఇవిఎం గోదాముల పరిశీలన



రాజకీయ నేతలతో కలసి ఇవిఎంలను పరిశీలిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి. - ఆరిలోవ : ఇవిఎం గోదాముల వద్ద సిబ్బంది అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఎంఎన్. హరేంధిరప్రసాద్ ఆదేశించారు గురువారం. చినగదిలిలోని ఇవిఎం గోదాములను వివిధ రాజకీయ పార్టీల నేతలతో కలిసి పరిశీలించారు. సిసి కెమెరాల పనితీరు, ప్రధాన ద్వారం సీళ్లను పరిశీలించారు. తాళాలు తీయించి గోదాముల లోపల భాగంలో పరిస్థితులను క్షుణ్ణంగా పరిశీలించారు. భద్రతా ప్రమాణాలపై అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. భద్రతా ప్రమాణాలు, లాగ్ బుక్ నిర్వహణ ఇతర అంశాలపై కలెక్టర్ ఆరా తీశారు. పార్లమెంటు, అసెంబ్లీల వారీగా భద్రపరిచిన ఇవిఎం స్థితిగతులను కలెక్టర్‌కు ఎన్నికల విభాగం అధికారులు వివరించారు. పర్యటనలో బిజెపి నేత పరశురామరాజు, రమేష్, టిడిపి నేతలు దొరబాబు, దేవీ పరమేశ్వరరావు, అప్పలస్వామి, వైసిపి నేత కృష్ణకాంత్, బిఎస్‌పి నేత శివప్రసాద్, రెవెన్యూ, ఎలక్షన్ సెల్ అధికారులు ఉన్నారు.

నేడు హౌసింగ్ కాలనీని సందర్శించనున్న మంత్రుల బృందం

ప్రజాశక్తి - ఆనందపురం : మండలంలోని గిడిజాల, తంగుడుబిల్లిలో ఏర్పాటు చేసిన హౌసింగ్ కాలనీని శుక్రవారం రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, మంత్రి పార్థసారథి, స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పరిశీలించనున్నట్లు స్థానిక నేతలు తెలిపారు. పార్టీల కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు

వృద్ధులు,వికలాంగులకు ఇంటి వద్దకే రేషన్



వికలాంగురాలికి రేషన్ అందజేస్తున్న డీలర్

ప్రజాశక్తి -తగరపువలస : 65 ఏళ్ల పైబడిన వద్ధులు , మంచం నుంచి కదలలేని వారు, వికలాంగులకు గురువారం ఇంటింటికి వెళ్లి రేషన్ సరుకులు పంపిణీ చేశారు. జూలై నెలలో ఇవ్వాల్సిన రేషన్ ఈ నెల 26 నుంచి 30 వ తేదీ లోగా అందరు వృద్ధులు, వికలాంగులకు పంపిణీ చేయాలని ప్రభుత్వం ఆదేశించిన నేపథ్యంలో స్థానిక రేషన్‌డీలర్లు బియ్యాన్ని అందజేశారు .

దేశవ్యాప్త కార్మిక సమ్మెను జయప్రదం చేయండి



ఎన్‌టిపిసి గేట్ వద్ద మాట్లాడుతున్న సిఐటియు నేత గనిశెట్టి

ప్రజాశక్తి- పరవాడ

కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కోరుతూ జులై 9న దేశవ్యాప్తంగా జరిగే కార్మిక సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం ఎన్టిపిసి మెయిన్ గేట్ వద్ద కరపత్రం విడుదల చేసి కార్మికులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ కనీస వేతనాల చట్టం అమలు చేయాలన్నారు. కార్మికులు పోరాటాల ద్వారా సాధించిన కార్మిక చట్టాలను యాజమాన్యాలకు అనుకూలంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మార్పులు చేస్తున్నాయని తెలిపారు. కార్మికులకు ఎనిమిది గంటల పనిని 12 గంటలకు టిడిపి కూటమి ప్రభుత్వం చేసిన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని గనిశెట్టి డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు పైలా పోతి నాయుడు, పి గోవిందరాజు, పైల సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

సమ్మె జయప్రదానికి సిఐటియు ప్రచారం

విశాఖ కలెక్టరేట్ : వచ్చేనెల 9న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు నేతలు పిలుపునిచ్చారు. గురువారం జివిఎంసి 49వ వార్డులో సిఐటియు ఆధ్వర్యంలో మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులు విస్తృత ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్మికుల వేతనాలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్న ప్రభుత్వం, పారిశుధ్య విభాగాన్ని కూడా ప్రయివేటుపరం చేయాలని చూస్తోందని, దీనికి వ్యతిరేకంగాకార్మికులంతా సంఘటితంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. లేబర్‌కోడ్స్ రద్దు చేయాలని, ప్రభుత్వరంగసంస్థల ప్రయివేటీకరణ ఆపాలని, కార్మికులకు కనీస వేతనాలు, ఇతర సౌకర్యాలను కల్పించాలన్న డిమాండ్‌చేపట్టే సమ్మెలో పెద్దఎత్తున పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మిక సంఘం, సిఐటియు జోన్ సెక్రటరీ ఒ అప్పారావు, జోన్ నాయకులు ఎస్ శ్రావణ్‌కుమార్, వార్డు నాయకులు కె బాలరాజు, సత్యవతి, పుణ్యవతి పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మె పోస్టర్ ఆవిష్కరణ

తగరపువలస : వచ్చేనెల సార్వత్రిక సమ్మె జయప్రదం చేయాలని కోరుతూ సిఐటియు జోన్ నాయకులు స్థానిక వై జంక్షన్ ఆటో స్టాండ్ వద్ద వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సిఐటియు జోన్ కార్యదర్శి ఆర్ఎస్ఎన్ మూర్తి, నాయకులు ఎస్ అప్పలనాయుడు, నీలాతి రాము, జి శ్రీను, పల్లా పెంటరాజు. ఆటో కార్మికులు పాల్గొన్నారు



తగరపువలసలో వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మూర్తి తదితరులు

ముఠా మేస్త్రీలతో సమావేశం

విశాఖ కలెక్టరేట్ : జూలై 9న దేశవ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మెలో ముఠా కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని విశాఖ ముఠా కార్మిక సంఘాల ప్రధాన కార్యదర్శులు ఎం.సుబ్బారావు (సిఐటియు), ఎం.మన్మధరావు (ఎఐటియుసి) విజ్ఞప్తి చేశారు. గురువారం పూర్ణా మార్కెట్‌లో ముఠా కార్మికుల మేస్త్రిల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమ్మె రోజున డిఆర్ఎం ఆఫీసు నుంచి జరిగే కార్మిక మహా ప్రదర్శనలో అందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పోస్టర్ ఆవిష్కరించారు. జి.సూరిబాబు, ఎం.శ్రీనివాసరావు, ఎ.పైడిరాజు, బి.సాంబయ్య, ఆర్.నాయుడు పాల్గొన్నారు. పాత పోస్ట్ ఆఫీస్ జంక్షన్‌లో సమ్మె జయప్రదం కోరుతూ ఆటోడ్రైవర్లు ప్రచారం చేపట్టారు. వారినుద్దేశించి ఎపి ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎఐటియుసి) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వామన మూర్తి మాట్లాడారు.



జివిఎంసి 49వ వార్డులో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం



పూర్ణా మార్కెట్‌లో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ముఠా కార్మికులు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రత్నాకర్ తదితరులు

డైట్‌లో ఇఐపిడిటి 2కె25 పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక డైట్ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం "ఎంపవరింగ్ ఇన్నోవేటర్స్ విత్ ప్రోగ్రెసివ్ డిజైన్ థింకింగ్ అప్రోచ్" (ఈఐపిడిటి- 2కె25) కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఇనిస్టిట్యూట్ చైర్మన్ దాడి రత్నాకర్ చేతుల మీదుగా విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 30 నుండి జూలై 5 వరకు ఈ కార్యక్రమం అట్టహాసంగా జరుగుతుందని తెలిపారు. నిర్వాహకులు మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి ఏఐసిటిఈ నుండి రూ.3.5 లక్షల నిధులు మంజూరైనట్లు చెప్పారు. ఏఐసిటిఈ అటల్, ఐఐసి సంయుక్త ఆధ్వర్యంలో ఎన్ఆర్‌డిసి ఇండియా ఐఐసితో కలసి నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రెసివ్ డిజైన్ థింకింగ్పై ప్రత్యేక సెషన్లు, వర్క్ షాప్, నెట్వర్కింగ్ అవకాశాలు, స్టార్టప్ మెంటార్షిప్, విద్యార్థుల ప్రాజెక్ట్ ప్రదర్శనలు వంటి ఎన్నో ముఖ్యమైన అంశాలు ఉంటాయని పేర్కొన్నారు. ఏఐసిటిఈ అటల్, ఎఫ్‌డిపిలు ఫ్యాకల్టీ అభివృద్ధికి, నూతన ఆలోచనలకు గొప్ప వేదిక అని తెలిపారు. అధ్యాపకులు ప్రోగ్రెసివ్ డిజైన్ థింకింగ్ వంటి ఆధునిక విద్యా విధానాలను నేర్చుకుని విద్యార్థులకు ఉత్తమంగా మార్గనిర్దేశం చేస్తారని చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.వైకుంఠరావు, కోఆర్డినేటర్ డా. కె. సుజాత,వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి. గణేష్ ప్రసాద్ రెడ్డి, ఎగ్జామినర్ కంట్రోలర్ డాక్టర్ జివి. శ్రీధర్, డీన్ అకాడమిక్స్ డాక్టర్ వివి.ఫణిబాబు, అసోసియేట్ డీన్ అడ్మిన్ ఎం.పద్మాకర్, అకాడమిక్ కోఆర్డినేటర్ ఏ.కృష్ణనాగ్, ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ ఆఫీసర్ ఏ.హేమంత్ కుమార్, విభాగాధిపతులు పాల్గొన్నారు.

ఆర్‌టిసి బస్టాండ్ బురదమయం

ప్రజాశక్తి-కశింకోట

కశింకోట ఆర్‌టిసి బస్టాండ్ బురదబురదగా మారింది. మండలం కేంద్రంలో ఉన్న ఈ కాంప్లెక్స్‌లో యలమంచిలి, అనకాపల్లి వైపు వెళ్లే బస్సులు అగుతూ ఉంటాయి. రెండు రోజులుగా చిరు జల్లలకు గ్రావెల్ మట్టి బురదగా మారింది. దీంతో ప్రయాణకులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను పరిష్కరించాలని నిత్యం పట్టణ ప్రాంతానికి వెళ్లేవారు ఉద్యోగులు కోరుతున్నారు.



బురదబురదగా ఉన్న కశింకోట ఆర్టీసీ బస్టాండ్

అసంపూర్తిగా నిలిచిపోయిన ఆర్ఎస్‌కె



నిర్మాణం మధ్య ఆగిపోయిన రైతు సేవా కేంద్రం ఇదే..

ప్రజాశక్తి-కశింకోట

కశింకోట మండలం కన్నూరుపాలెం (ఈ.చౌడువాడ) గ్రామంలో గత ప్రభుత్వ హయాంలో నిర్మాణం ప్రారంభించిన రైతు భరోసా కేంద్రం (ప్రస్తుతం రైతు సేవా కేంద్రం-ఆర్ఎస్‌కె) నిర్మాణ పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. రైతులకు వివిధ రకాల సేవలు అందించే ఉద్దేశంతో గత ప్రభ్వుతం రైతు భరోసా కేంద్రాలను ప్రతి గ్రామ సచివాలయం పరిధిలోనూ ప్రారంభించింది. వీటికి పక్కా భవనాల నిర్మాణం చేపట్టింది. ఇందులో భాగంగా కన్నూరుపాలెం గ్రామ మధ్యలో రైతు భరోసా కేంద్రం నిర్మాణం ప్రారంభించగా, అది నేటికీ పూర్తి కాలేదు. ప్రభుత్వం మారడంతో రైతు భరోసా కేంద్రాలు రైతు సేవా కేంద్రాలు పేరుమార్పు చేశారుగాని అసంపూర్తిగా నిలిచిపోయిన భవనాలను మాత్రం పూర్తి చేయలేదు. దీంతో రైతులకు సేవలు అందించడానికి సిబ్బంది ఇబ్బంది పడాల్సి వస్తోంది. ఇప్పటికైనా ప్రభుత్వం, జిల్లా ఉన్నతాధికారులు స్పందించి అసంపూర్తిగా నిలిచిపోయిన రైతు సేవా కేంద్రం భవనాన్ని పూర్తి చేసి రైతులు అందుబాటులో తీసుకురావాలని గ్రామస్తులు, రైతులు కోరుతున్నారు.



మొక్కలు నాటుతున్న కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ తదితరులు

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

ప్రజాశక్తి-పరవాడ

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని గ్రేటర్ విశాఖ 79వ కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ అన్నారు. వార్డు పరిధిలోని లంకెల పాలెం ఎస్సీ కాలనీ దగ్గర గల శ్మశాన వాటికలో గురువారం కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్, మిత్రులు, జీవీఎంసీ సిబ్బంది మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రియమిత్రులు గుర్రం శంకర్రావు పుట్టినరోజు, పెళ్లిరోజు సందర్భంగా ఈ మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టడం చాలా సంతోషకరంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో గుర్రం నాయుడు, గుర్రం శంకర్రావు, సుత్తి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో చెరుకు నాట్లు

రైతుల్లో తగ్గిన సాగు ఆసక్తి

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట

మండలంలోని పలు గ్రామాల్లో రైతులు చెరకు నాట్లు వేస్తున్నారు. గతంలో ముమ్మరంగా సాగు అయ్యే చెరుకు ఈ ఏడాది చాలా వరకు తగ్గిపోయింది. మండలంలోని కొన్ని గ్రామాలు విజయరామరాజుపేట, రాజాం, నీలకంఠాపురం తదితర గ్రామాల్లో బెల్లం తయారీకి చెరుకు సాగు చేస్తూ ఉంటారు. మిగతా గ్రామాల్లో రైతులు ముఖ్యంగా గోవాడ చక్కెర కర్మాగారానికి సరఫరా చేయడానికి చెరుకు సాగు చేస్తూ ఉండేవారు. కొంతకాలంగా గోవాడ చక్కెర కర్మగారానికి చెరకు సరఫరా చేసిన రైతులకు సకాలంలో పేమెంట్లు ఇవ్వకపోవడం పర్మిట్లు సక్రమంగా లేకపోవడం తదితర కారణాలతో పాటు చెరకు సాగుకు ఖర్చులు విపరీతంగా పెరిగిపోవడంతో రైతులు చెరుకు సాగు చేపట్టడానికి ఆసక్తి చూపడం లేదు. మండలంలోని రైతులు ప్రధానంగా వాణిజ్య పంట అయినా చెరకు సాగును, వరి పంటను అధికంగా సాగు చేసేవారు. గత రెండు మూడేళ్ల నుంచి చెరుకు సాగును పూర్తిగా తగ్గించేశారు. మండలంలో ఏ గ్రామంలో చూసినా విరివిగా కనిపించే చెరుకు సాగు ఈ ఏడాది అంతంత మాత్రం గానే ఉంది. గతంలో ఒక్కొక్క గ్రామంలో రెండు మూడు వందల ఎకరాల సాగు అయ్యే చెరకు ఈ ఏడాది 20 నుండి 30 ఎకరాల వరకు తగ్గిపోయింది. కొంతమంది రైతులు కష్టమైనా సరే తప్పని పరిస్థితుల్లో చెరకు సాగు చేపడుతున్నారు.



చెరుకు నాట్లు వేస్తున్న రైతులు



అగ్ని ప్రమాదంలో కాలిపోయిన ధాన్యం, ఇతర వస్తువులు

గ్యాస్ లీకై అగ్ని ప్రమాదం

- భారీగా ఆస్తి నష్టం

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని గొల్లలపాలెం పంచాయతీ శివారు తమ్మయ్యపాలెం గ్రామంలో గురువారం వేకువజామున గ్యాస్ బండ లీకైన సంఘటనలో మంటలు చెలరేగి రేకుల షెడ్డులో అగ్ని ప్రమాదం సంభవించింది. బాధితులు కథనం ప్రకారం... తమ్మయ్యపాలెం గ్రామానికి చెందిన జోగ పైడమ్మ, కోటిబాబు తమ ఇంటిపై నిర్మించిన రేకుల షెడ్డులో నివాసం ఉంటున్నారు. కింద ఇంట్లో కుమారుడు అచ్చిబాబు, కోడలు, పిల్లలు ఉంటున్నారు. గురువారం వేకువ జామున పైడమ్మ టీ పెట్టుకోవడానికి గ్యాస్ స్టవ్ వెలిగించగా ఒక్కసారిగా గ్యాస్ లీక్ అయ్యి మంటలు చెలరేగడంతో పెద్దగా కేకలు వేసి తన కుమారుడిని పిలిచింది. కుమారుడు సంఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేయలేక సబ్బవరం ఫైర్ స్టేషన్‌కి ఫోన్ చేశారు. ఫైర్ స్టేషన్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని మంటలు అదుపు చేశారు. ఈ సంఘటనలో 15 బస్తాలు ధాన్యం, 10 కోళ్ళు, ఐదు తులాల బంగారం, మూడు లక్షలు నగదు, విలువైన ఎలక్ట్రానిక్ గృహోపకరణాలు, భూమికి సంబంధించిన పత్రాలు, చిరుధాన్యాలు బూడిదయినట్లు తెలిపారు. ఈ సంఘటన తెలుసుకున్న స్థానిక తహసిల్దార్ బి.చిన్నకృష్ణ గురువారం ఉదయం సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించి, వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆస్తి నష్టాన్ని పరిశీలించారు. ప్రభుత్వం తక్షణ సహాయం కింద 25 కిలోల బియ్యం, దుప్పట్లు అందజేశారు. దీనిపై సమగ్ర దర్యాప్తు చేసి ఆస్తి నష్టం నివేదికను ఉన్నత అధికారులకు పంపిస్తామని తహశీల్దారు తెలిపారు.

విద్యార్థులకు పుస్తకాలు, పెన్నుల పంపిణీ

ప్రజాశక్తి-అనకాపల్లి : పి.వి.చలపతిరావు జయంతి సందర్భంగా పొట్టి శ్రీరాములు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మండలంలోని సుందరయ్యపేట పాఠశాలలో విద్యార్థులకు పెన్నులు పుస్తకాలు పంపిణీ చేశారు. బిజెపి నాయకులు గంగుపాము నాగేశ్వరావు తన సొంత నిధులు పదివేల రూపాయలతో నోట్ పుస్తకాలు, పెన్నులు విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పొట్టి శ్రీరాములు చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు విరోట్ల నరసింహామూర్తి, పాఠశాల కమిటీ చైర్మన్ దుగ్గిరావు, కోలపర్తి శ్రీను, మల్ల మల్లయ్య నాయుడు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రహదారిపై చెత్త కుప్పలు తొలగించాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక వుడ్‌పేట ముత్యంవారి వీధి ప్రాంతంలో ఉన్న కాలువలో నుండి తీసిన పూడిక చెత్తనంతా రహదారి మీద ఇరువైపులా వేసి రెండు మూడు రోజులు అవుతున్నా ఇంకా తరలించలేదని, తక్షణమే దానిని తొలగించాలని బిఎస్‌పి అనకాపల్లి ఇన్చార్జ్ సూదికొండ మాణిక్యాలరావు డిమాండ్ చేశారు. పార్టీ నాయకులు వనమాల నాగభూషణంతో కలిసి ఆ ప్రాంతాన్ని గురువారం పరిశీలించారు. అనంతరం మాణిక్యాలరావు మాట్లాడుతూ రహదారికి ఇరువైపులా పూడిక చెత్తతో నిండిపోవడం వలన ద్విచక్ర వాహనదారులు, రహదారి మీద రాకపోకలు సాగించే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఆ మట్టి దిబ్బలు మురికి గుంటలుగా మారాయన్నారు. ఇప్పటికైనా జీవీఎంసీ సిబ్బంది అధికారులు స్పందించి ఆ చెత్తను అక్కడినుంచి తరలించాలని డిమాండ్ చేశారు.



రోడ్డుపై వేసిన చెత్త కుప్పలను చూపుతున్న బిఎస్‌పి నాయకులు

యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

- జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్
- పలు చోట్ల ర్యాలీలు



అనకాపల్లిలో ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్, ఎస్‌పి తదితరులు

ప్రజాశక్తి-అనకాపల్లి

యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి తమ ఆరోగ్యాలను కాపాడుకోవడంతో పాటు మంచి సమాజ నిర్మాణానికి పాటుపడాలని కలెక్టర్ విజయకృష్ణన్ పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా గురువారం అనకాపల్లి ఎన్టీఆర్ గ్రౌండ్స్‌లో జరిగిన కార్యక్రమానికి కలెక్టర్ విజయకృష్ణన్, ఎస్పీ తుహిన్ సిన్హా, ఎక్సైజ్ కమిషనర్ సుర్జిత్ సింగ్ హాజరయ్యారు. స్థానిక మున్సిపల్ స్టేడియంలో మాదకద్రవ్యాల చట్టాలపై ఏర్పాటు చేసిన స్టాల్స్ సందర్శించారు. మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఎన్టీఆర్ గ్రౌండ్ నుండి రింగ్ రోడ్డు వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలన్నారు. డ్రగ్స్ కేసులో ఇరుక్కున్న వారికి కఠినమైన శిక్షలు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో గవర కార్పొరేషన్ చైర్మన్ మల్ల సురేంద్ర, ద్వారపురెడ్డి పరమేశ్వరావు, పోలీస్, ఎక్సైజ్, రెవిన్యూ అధికారులు పాల్గొన్నారు.

ప్రపంచ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా గురువారం ఎన్టీఆర్ బెల్లం మార్కెట్‌లో అనకాపల్లి వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. వైద్యులు డిడి నాయుడు, వాకర్స్ అధ్యక్షులు రాపేటి నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

చోడవరం : అంతర్జాతీయ మాదకద్రవ్య వినియోగ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా చోడవరంలో విద్యార్థులు, అధికారులు, పోలీసులు భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్ రాజు పాల్గొని ప్రసంగించారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు ఎ.రామారావు, ఎంపీడీవో ఆంజనేయులు, సీఐ అప్పలరాజు, టిడిపి నాయకులు జి మల్లు నాయుడు, కనిశెట్టి సన్యాసిరావు పాల్గొన్నారు.

కె.కోటపాడు : యువకులు మత్తు పదార్థాల బారిన పడకుండా జాగ్రత్త తీసుకోవాలని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా గురువారం నియోజకవర్గం నాలుగు మండలాల నుండి నుంచి వచ్చిన పాఠశాల విద్యార్థులు, అధికారులు, ఉపాధ్యాయులు, అంగన్వాడీ, డ్వాక్రా మహిళలతో స్థానిక మూడు రోడ్ల జంక్షన్ వరకు భారీగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అనకాపల్లి డిఎస్‌పి మోహన్‌రావు, వెలమ కార్పొరేషన్ చైర్మన్ పివిజి.కుమార్ టిడిపి నాయకులు కిలపర్తి భాస్కరరావు, రొంగలి మహేష్, జూరెడ్డి రాము పాల్గొన్నారు.

సబ్బవరం : మాదక ద్రవ్యాలను, పిల్లల అక్రమ రవాణాను అరికడదామని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు అన్నారు. స్థానిక ప్రతిభ విద్యాలయంలో జరిగిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ప్రతిభా విద్యాలయం నుండి ఎన్టీఆర్ సర్కిల్ వరకు భారీ ర్యాలీ నిర్వహించి మానవహారం చేపట్టారు. కార్యక్రమంలో ఎంపీడీవో పి.పద్మజ, డిఎస్పి పి.నాగేశ్వరరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎస్‌డి.అనిత, తహశీల్దారు బి.చిన్నకృష్ణ, స్పెషల్ ఆఫీసర్లు కె.రామామణి, ఎంపిపి బోకం సూర్యకుమారి, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, కూటమి పాల్గొన్నారు.



కె.కోటపాడులో...



చోడవరం ఎమ్మెల్యే రాజు సమక్షంలో ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

అచ్యుతాపురం : అంతర్జాతీయ మాదకద్రవ్యాల నివారణ దినోత్సవం సందర్భంగా పూడిమడక మెరైన్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎస్.సింహాద్రి నాయుడు, ఎస్ఐలు జి.పైడిరాజు, బిహెచ్‌విఎన్ఎస్ రాజు ఆధ్వర్యాన పూడిమడకలో హైస్కూల్ విద్యార్థులు గురువారం ర్యాలీ చేశారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.

గొలుగొండ: మండలంలోని ఏఎల్.పురం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు గురువారం మాదక ద్రవ్యాల నియంత్రణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. నిషా ముక్త్ భారత్‌లో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీలు మంగ, రాజకుమారి, ధనలక్ష్మి, రాజకుమారి, రాజేశ్వరి పాల్గొన్నారు. జోగుంపేట జెడ్పీ హైస్కూల్లో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల నివారణ దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై పి.రామారావు పాల్గొన్నారు.



సబ్బవరం ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే పంచకర్ల

నర్సీపట్నం టౌన్ : మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా ఐసిడిఎస్ సిడిపిఒ రమణ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ పాఠశాలలో అవగాహన కల్పించారు. నర్సీపట్నం పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్ రామలక్ష్మి, అంగన్వాడీ వర్కర్స్ పాల్గొన్నారు. గబ్బాడ గ్రామంలో సచివాలయం కార్యాలయం వద్ద కారుణ్య జూనియర్ కాలేజీ విద్యార్థులు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల్ లీగల సర్వీసెస్ కమిటీ సభ్యులు శివ ప్రసాదు, ప్రసాద్, శివ నారాయణ, ఉపసర్పంచ్ రాజులు నాయుడు పాల్గొన్నారు.స్థానిక పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో డిఎస్పి శ్రీనివాస్ మాట్లాడుతూ, మాదకద్రవ్యాలతో యువత భవిష్యత్ పతనమవుతోందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సురేంద్ర, ఆర్డీవో వివి రమణ, సిఐ రేవతమ్మ, టౌన్ సిఐ గోవిందరావు, జనసేన నాయకులు రాజన్న వీర సూర్యచంద్ర పాల్గొన్నారు.నర్సీపట్నంలో ఎక్సైజ్ సర్కిల్ ఇన్స్పెక్టర్ సునీల్ కుమార్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు

నక్కపల్లి : మత్తు పానీయాలకు యువత బానిసలు అవ్వద్దని తహసిల్దార్ నరసింహమూర్తి, సిఐ కుమారస్వామి అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాల మైదానంలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు.

పాయకరావుపేట : పాయకరావుపేటలో సిఐ జి అప్పన్న ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భీమునిపట్నం : మాదక ద్రవ్య వ్యతిరేక దినోత్సవం సందర్భంగా గురువారం జాతీయ న్యాయ సేవా సంస్థ ఆదేశాలతో మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక ప్రధాన న్యాయ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు నుంచి తహశీల్దార్ కార్యాలయం, గంటస్తంభం, పాత బస్టాండ్ మీదుగా ఒకటో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు వరకు జడ్జిలు, న్యాయవాదులు, పోలీసు సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి డి సౌజన్య, ఒకటో అదనపు జూనియర్ సివిల్ జడ్జి పి స్వాతిభవాని, న్యాయవాదుల సంఘం అధ్యక్షులు ఎన్ జనార్దనరావు, కార్యదర్శి కె మంజుల పాల్గొన్నారు.



భీమిలి ర్యాలీలో పాల్గొన్న న్యాయమూర్తులు, న్యాయవాదులు

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో డ్రగ్స్ అనర్థాలపై అవగాహనకు వాక్‌థాన్ నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ఇంచార్జి ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్ విష్ణుమూర్తి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు

ములగాడ : స్థానిక సెయింట్ ఆన్స్ కళాశాలలో జాతీయ సేవా పథకం, ఈగల్ క్లబ్ ఆధ్వర్యంలో డ్రగ్స్ అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎన్ఎస్ఎస్ జిల్లా నోడల్ అధికారి భాగ్యలక్ష్మి,ఈగల్ క్లబ్ కార్యదర్శి ఎ. రోజా, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిస్టర్ ప్రేమ కుమారి పాల్గొన్నారు.

గాజువాక : జివిఎంసి 70వ వార్డు చట్టివానిపాలెం భాస్కర్ విద్యానికేతన్ పాఠశాలలో డ్రగ్స్ వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్ పాలవలస భాస్కరరావు డ్రగ్స్ అనర్థాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ప్లకార్డులు, నినాదాలతో ర్యాలీ చేశారు. పాఠశాల ఉపాధ్యాయులు మోహన్, శిరీష సిబ్బంది, తల్లిదండ్రులు పాల్గొన్నారు..

సీతమ్మధార : జివిఎంసి 50వ వార్డుగాంధీనగర్ అంగన్వాడీ కేంద్రం ఆధ్వర్యంలో కిశోర వికాసం టీం సభ్యులు డ్రగ్స్ అనర్థాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కల్పించారు. బీమాదకద్రవ్య మహమ్మారిని సమస్టిగా తరిమికొట్టాలని కిశోర్ వికాస్ టీం సభ్యులు పిలుపునిచ్చారు. జివిఎంసి మాధవధార హెచ్‌ఎం ఎస్‌పి నాయుడు, విద్యార్థులు, అంగన్వాడీ టీచర్ మౌలా బీబీ పాల్గొన్నారు.

'అలయన్స్'లో..

ఎంవిపి.కాలనీ : మద్దిలపాలెంలోని అలయన్స్ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల, హిమా హ్యూమానిటేరియల్ అసోసియేషన్ సంయుక్తంగా గురువారం మధ్యాహ్నం అలయన్స్ కళాశాల ఆవరణలో అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహించాయి. విశిష్ట అతిథిగా పాల్గొన్న రెవెన్యూ సర్వీసెస్ డిప్యూటీ కమిషనర్ ఎం.రవిశంకర్ మాట్లాడుతూ మాదకద్రవ్యాలతో జీవితాలు నాశనమవుతున్నాయన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వాణి మాట్లాడుతూ కుటుంబ పెద్దలు సవ్యంగా వ్యవహరిస్తే ఏ విధమైన దురలవాట్లకూ పిల్లలు బానిసలు కాకుండా చూడొచ్చని ఉందన్నారు. గౌరవ అతిథులుగా ఆంధ్ర మెడికల్ కళాశాల సైకాలజీ ప్రొఫెసర్ డాక్టర్ జి సురేష్ కుమార్, ఎంవిపి ఎస్‌ఐ ధనుంజయ నాయుడు, కెజిహెచ్ ప్రొఫెసర్ డాక్టర్ బొంగు శ్రీనివాసరావు, మాజీ స్పెషల్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ పైలా సన్ని బాబు హాజరయ్యారు. అలయన్స్ కళాశాల డైరెక్టర్ కొల్లా సతీష్ కుమార్, హేమ హ్యూమనిటేరియన్ అసోసియేషన్ చైర్మన్ మూర్తి, హిమాని హ్యూమనిటేరియన్ అసోసియేషన్ ఫౌండర్ జనరల్ సెక్రటరీ డివిడి.దాస్, అలయన్స్ కళాశాల అకాడమిక్ డైరెక్టర్ కార్తికేశ్వర పాండా, ప్రిన్సిపాల్ బి.శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ ఎ.శ్రీనివాసరావు, ఎం జయశ్రీ, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



అలయన్స్ కాలేజీలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు



విత్తనాలు పంపిణీ చేస్తున్న సర్పంచులు

రైతులకు వరి విత్తనాల పంపిణీ

ప్రజాశక్తి- మాడుగుల:మండలంలోని తాటిపర్తి, వీరనారాయణం పంచాయతీలలో గురువారం రైతులకు సబ్సిడీపై విత్తనాలు సర్పంచులు ఎల్లపు కొండ అప్పారావు, అల్లంగి గౌరీ దేవి సంజీవరావు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఓంర్రు గంగమ్మకృష్ణ, జనసేన మండల ప్రధాన కార్యదర్శి దాసరి అచ్యుతరావు, పందిరి స్వామి, ఉద్యానవన సహాయకురాలు అలేఖ్య, మత్స్య శాఖ సహాయకురాలు హేమలత, వీఆర్వో సత్యనారాయణ, తెలుగుదేశం పార్టీ గ్రామశాఖ అధ్యక్షురాలు సలుగు లక్ష్మి, ఎస్టీ సెల్ అధ్యక్షులు అప్పారావు పాల్గొన్నారు.

పోలీసు నిర్బంధంలోనూ..

కొనసాగిన మత్స్యకారుల ధర్నా

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలో వేంపాడు రెవెన్యూ అమలాపురంలో శ్రీ కనకమహాలక్ష్మి ఫిషర్మెన్ కో-ఆపరేటివ్ సొసైటీ భూములకు వెంటనే పరిహారం చెల్లించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం అప్పలరాజు, మత్స్యకారులు డిమాండ్ చేశారు. పరిహారం చెల్లించాలని కోరుతూ మత్స్యకారులు తలపెట్టిన ధర్నా గురువారం నాటికి 8వ రోజుకు చేరింది. మత్స్యకారుల ఆందోళన శిబిరం వద్ద పోలీసులను మోహరించారు. ఈ సందర్భంగా సిపిఎం నేత అప్పలరాజు, మత్స్యకారులు మాట్లాడుతూ తమ సొసైటీకి చెందిన భూములకు ఎటువంటి పరిహారం చెల్లించకుండా పనులు చేపట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. అధికారులు స్పందించి వెంటనే పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మత్స్యకారులు, మత్స్యకార మహిళలు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న శిబిరానికి వచ్చిన పోలీసులు



దుస్తులు పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయులు

విద్యార్థులకు దుస్తుల పంపిణీ

ప్రజాశక్తి- రావికమతం: ప్రభుత్వం పాఠశాల విద్యార్థులకు అందజేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కేజీబీవీ పాఠశాల చైర్మన్ కొలిమల్ల జగన్నాథం తెలిపారు. మండలంలో గర్నికం కేజీబీవీ పాఠశాలలో గురువారం విద్యార్థినిలకు యూనిఫామ్ దుస్తులను అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ, పాఠశాలలో గుణాత్మకమైన విద్యను అందించడం తోపాటు, నాణ్యమైనటువంటి భోజనం కూడా అందిస్తున్నదన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్, పాఠశాల సిబ్బంది, విద్యార్థినిలు పలువురు పాల్గొన్నారు.

ఎపియుడబ్ల్యుజె

రాష్ట్ర కార్యదర్శిగా స్వామి



ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ రాష్ట్ర కార్యదర్శిగా స్వామి ఏకగ్రీవంగా ఎన్నిక అయ్యారు. ఒంగోలులో రాష్ట్ర మహాసభలు జరిగాయి. నర్సీపట్నం సీనియర్ జర్నలిస్ట్, ఉమ్మడి విశాఖ జిల్లా మాజీ ప్రెసిడెంట్ బి. సిహెచ్. స్వామి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్వామికి పలువురు అభినందనలు తెలియజేశారు.

నేడు ఆధార్ కేంద్రం పున:ప్రారంభం

ప్రజాశక్తి- మాడుగుల:మాడుగుల ఇండియన్ బ్యాంక్ లో ఆధార్ సెంటర్ గత ఆరు నెలలుగా టెక్నికల్ సమస్య కారణంగా ఆగిందని, ఈనెల 27న శుక్రవారం పున:ప్రారంభిస్తామని బ్యాంక్ మేనేజర్ నాగేశ్వరరావు తెలిపారు. మండలం పరిధిలో ఉన్న ప్రజలు ఆధార్ సేవలు వినియోగించుకోవాలని కోరారు.

వైసిపి మండల అధ్యక్షునిగా శాంతిరామ్

ప్రజాశక్తి -గొలుగొండ:వైయస్సార్ కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడిగా కొరుప్రోలు పాణి శాంతారామ్ నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం నర్సీపట్నం మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్‌ను ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాంతారామ్ మాజీ ఎమ్మెల్యే గణేష్‌ను శాలువతో సత్కరించారు. గొలుగొండ మండలం పార్టీ నాయకుల అందరితో కలిసి సమన్వయంతో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సుర్ల వెంకట గిరిబాబు, ఎంపిపి గజ్జలపు మణికుమారి, వైస్ ఎంపిపి సుర్ల ఆదినారాయణ, మాజీ వైసీపీ మండల అధ్యక్షులు లెక్కల సత్యనారాయణ పాల్గొన్నారు.



సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే గణేష్

వైసిపి గ్రామ కమిటీ ఎన్నిక

గొలుగొండ:మండలంలోని ఏఎల్.పురం మేజర్ పంచాయతీలో గ్రామ కమిటీ ఇన్‌ఛార్జ్ పరవాడ కవి, సర్పంచ్, వైసిపి జిల్లా మహిళా అధ్యక్షురాలు లోచల సుజాత, ఎంపిటిసిలు చింతల బుల్లిప్రసాద్, మామిడి కృష్ణ, పెదబాబుల ఆధ్వర్యంలో వైసిపి గ్రామ కమిటీ ఎన్నికైంది.గ్రామ కమిటీ అధ్యక్షుడిగా చిటికెల వివేకానందనాయుడు, యువజన విభాగం అధ్యక్షుడిగా దిగుమర్తి రమేష్, రైతు విభాగం అధ్యక్షుడిగా రొంగల సత్యనారాయణ, మహిళా విభాగం అధ్యక్షులుగా సర్వసిద్ది ఆదిలక్ష్మిలను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.



శానిటేషన్ పనులు పరిశీలిస్తున్న ఎంపిడిఒ

ఇంటింటా చెత్తను సేకరించాలి

ప్రజాశక్తి -నక్కపల్లి:గ్రామాల్లో ఇంటింటా తడి, పొడి చెత్తను సేకరించి సంపద తయారీ కేంద్రాలకు తరలించాలని ఎంపీడీవో డి సీతారామరాజు అన్నారు. మండలంలో గొడిచెర్ల గ్రామంలో గురువారం శానిటేషన్ పనులను పరిశీలించారు. చెత్త సేకరణ పై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.తడి పొడి చెత్తను సేకరించి, సంపద తయారీ కేంద్రానికి తరలించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి ఈఓపిఆర్డి శ్రీను, పంచాయతీ కార్యదర్శి కిరణ్ పాల్గొన్నారు.

తహశీల్దార్, డిటిలు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి- పాయకరావుపేట: పాయకరావుపేట తహశీల్దార్‌గా ఎస్.ఏ.మహేశ్వరరావు గురువారం బాధ్యతలు చేపట్టారు. మునగపాక మండలం బదిలీపై వచ్చారు. రెవెన్యూ సిబ్బంది ఘనంగా సత్కరించారు. అలాగే పాయకరావు పేట డిప్యూటీ తహశీల్దార్‌గా శాంతిభూషణరావు బాధ్యతలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ సాధారణ బదిలీపై ఎన్.ఎ.ఓ.బి కార్యాలయం నుండి రావడం జరిగిందని తెలిపారు. అధికారులు సత్కరించారు.



తహశీల్దార్



డిటీ

జీవాలకు నట్టల నివారణ మందులు



చీడికాడలో వేస్తున్న మందులు

ప్రజాశక్తి -చీడికాడ:మండలంలోని జెబి. పురం, ఖండివరం, తురువోలు గ్రామాలలో గొర్రెలు, మేకలకు ఉచితముగా నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వరహాపురం సర్పంచ్ గొల్లవిల్లి రాజుబాబు, ఎంపీ.టి.సి దరిమిశెట్టి స్వాతి కొండబాబు, పశు వైద్యాధికారులు మణి లక్ష్మణ్, గణేష్, రాఘవమ్మ, పశు సంవర్ధక సహాయకులు మాధవి, సంతోష్, రాజేష్ పాల్గొన్నారు.

మాడుగుల: మండలంలోని పోతనపూడి అగ్రహారం గ్రామంలో గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు పంపిణీ చేయడం జరిగిందని కె. జె పురం పశు వైద్యాధికారి శివ కుమార్ తెలిపారు.ఈ కార్యక్రమాన్ని మాడుగుల ఏరియా పశు వైద్య శాల సహాయ సంచాలకులు . చిట్టి నాయుడు ఆకస్మికంగా తనిఖీ చేశారు. వచ్చే నెల 10వ తేదీ వరకు అన్ని గ్రామాలలో గొర్రెలు, మేకలకు ఉచితముగా నట్టల నివారణ మందులు పంపిణీ చేయడం జరుగుతుందని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ వైస్ ప్రెసిడెంట్ మైచర్ల నానాజీ, బిజెపి నాయకులు దరిమిశెట్టి నారాయణరావు, జనసేన నాయకులు బంటు నాగరాజు, పశు సంవర్ధక సహాయకుడు కన్నం నాయుడు పాల్గొన్నారు.

కశింకోట:మండలంలోని జమ్మాదులపాలెం గ్రామంలో గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందుల పంపిణీ కార్యక్రమాన్ని గురువారం జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ బి.రామ్మోహన్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 30వ తేదీ వరకు నట్టల నివారణ మందు పంపిణీ ఉంటుందని చెప్పారు. నట్టల నివారణ చేయడం ద్వారా జీవాలు ఆరోగ్యంగా చురుకుగా ఉంటాయి, వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని చెప్పారు. జీవాల్లో మాంసం, ఉన్ని దిగుబడి నాణ్యత పెరుగుతుందని, పిల్లల్లో మరణాల సంఖ్య తగ్గుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో అనకాపల్లి పశువైద్యశాఖ సహాయ సంచాలకులు బి.సౌజన్య, కసింకోట పశు వైద్యాధికారి డాక్టర్ సిహెచ్.చైతన్య మణి, గ్రామ సర్పంచ్ కరక రాజ్యలక్ష్మి శేషు, ఎంపిటిసి గూడెపు లక్ష్మి రాజు, కూటమి నాయకులు పాల్గొన్నారు

దేవరాపల్లి : గొర్రెలు మేకలకు నట్టల నివారణ మందు తప్పనిసరి వేయించాలని పశు వైద్యాధికారి జి.గాయత్రీ దేవి అన్నారు. దేవరాపల్లి మండలంలో 1080 జీవాలకు గురువారం నట్టల నివారణ మందులు పట్టించారు. ఈ కార్యక్రమం జూలై 10వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది సురేష్, శ్రీను, రైతులు పాల్గొన్నారు.



మాడుగులలో వేస్తున్న మందులు

సబ్బవరం : మండలంలోని తవ్వవానిపాలెం, పల్లవానిపాలెం, మర్రిపాలెం గ్రామాల్లో ఉచితంగా గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందుల పంపిణీ కార్యక్రమాన్ని మండలం పశు వైద్యాధికారి (అంతకాపల్లి) డాక్టర్ అరుణ ప్రారంభించారు. కార్యక్రమంలో తవ్వవానిపాలెం మాజీ సర్పంచ్ బోకం అప్పలనాయుడు, సాగు నీటి సంఘం అధ్యక్షులు బోకం శ్రీరామ్మూర్తి, ఆరిపాక పశు వైద్యాధికారి డాక్టర్ ఎస్.స్వర్ణలత, గుల్లేపల్లి పశు వైద్యాధికారి డాక్టర్ బి.సంధ్య, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలో అమలాపురం గ్రామంలో అభయాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవ వేడుకను గురువారం ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తుల సహకారంతో ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం భారీ అన్న సమారాధన నిర్వహించారు.భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.



పూజలు చేస్తున్న భక్తులు



బురదగా ఉన్న బస్ స్టేషన్

అస్తవ్యస్తంగా ఆర్‌టిసి బస్ స్టేషన్

- అవస్థలు పడుతున్న ప్రయాణికులు

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని కృష్ణదేవిపేట ఆర్టీసి బస్ స్టేషన్ అధ్వాన్నంగా మారింది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో బస్ స్టేషన్ మట్టి రోడ్డుపై ఉన్న గుంతల్లో నీరు చేరింది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బురదలో వెళ్లేందుకు సతమతం అవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు, స్థానికులు కోరుతున్నారు.

అదనపు భూసేకరణ చేపట్టొద్దు

- రైతుల ఆందోళన

ప్రజాశక్తి -నక్కపల్లి: నక్కపల్లి మండలంలో పరిశ్రమల ఏర్పాటు కోసం అదనపు భూసేకరణ ప్రక్రియను నిలుపుదల చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం అప్పలరాజు, రైతులు డిమాండ్ చేసారు. మండలంలో వేంపాడు గ్రామంలో గురువారం సిపిఎం నేత అప్పలరాజు ఆధ్వర్యంలో అదనపు భూసేకరణ చేయడానికి తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ రైతులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ, మండలంలో వైజాగ్ - చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్‌లో భాగంగా పరిశ్రమల స్థాపన కోసం ఏపీఐఐసీ సుమారుగా 5500 ఎకరాల వరకు భూసేకరణ చేపట్టడం జరిగిందన్నారు. భూములు ఇచ్చిన రైతాంగాన్ని, మత్స్యకారులు, వివిధ వృత్తిదారులు, భూములపై ఆధారపడి జీవనం సాగిస్తున్న కూలీలను ప్రభుత్వం పూర్తిస్థాయిలో ఆదుకోలేదని, సక్రమంగా న్యాయం చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మరల ఇప్పుడు ఆర్సిలార్ మిట్టల్, నిప్పన్ స్టీల్ ప్లాంట్‌కు, బల్క్ డ్రగ్స్ పార్క్, టౌన్ షిప్ నిర్మాణం కోసం సెకండ్ ఫేజ్ లో భాగంగా అదనపు భూసేకరణ చేపట్టేందుకు ప్రభుత్వం పూనుకోవడంతో అధికారులు ఆ దిశగా ప్రయత్నాలు సాగిస్తున్నారన్నారు. వేంపాడు, నెల్లిపూడి గ్రామాల్లో భూసేకరణ కోసం అధికారులు గ్రామసభ నిర్వహించగా, రైతులందరూ భూసేకరణను వ్యతిరేకించడం జరిగిందన్నారు. బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటుకు అదనంగా భూసేకరణ చేపట్టేందుకు సిహెచ్ లక్ష్మీపురం, పెద తీనార్ల గ్రామాల్లో అధికారులు గ్రామసభ నిర్వహించగా, రైతాంగం, అక్కడ ప్రజలు భూములు ఇచ్చేది లేదని అధికారులకు ముక్తకంఠంతో తేల్చి చెప్పడం జరిగిందన్నారు. అయినప్పటికీ అధికారులు భూ సేకరణ చేపట్టేందుకు ముమ్మరంగా ప్రయత్నాలు సాగిస్తున్నారని, నక్కపల్లి మండలాన్ని ఏం చేయదలుచుకున్నారని ప్రశ్నించారు. అభివృద్ధి అంటే ఈ ప్రాంతాన్ని కాలుష్య కోరల్లో ముంచే బల్క్ డ్రగ్స్ కంపెనీలు, ప్రైవేటు స్టీల్ ప్లాంట్‌లు మాత్రమే కాదని, వ్యవసాయ రంగాన్ని కూడా అభివృద్ధి చేయాలన్నారు. ఈ విధంగా భూములు మొత్తం సేకరిస్తే భవిష్యత్తులో వ్యవసాయ రంగం దెబ్బతిని, ఆహార ధాన్యాలు కొరత ఏర్పడి, తిండి గింజలు దొరకని పరిస్థితి ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.సత్యనారాయణ, ఎం.శ్రీనివాస్, ఏ.అప్పలరాజు, ఏ.పాము, డి.నూకులు, పి.నాగేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం నేత అప్పలరాజు, రైతులు



విద్యా కేంద్రాలుగా నర్సీపట్నం, చోడవరం

ప్రజాశక్తి-చోడవరం : చోడవరంలో ప్రభుత్వ పాఠశాలలతో పాటు ప్రైవేటు పాఠశాలలో కూడా అధికంగానే ఉన్నాయి. ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి పరీక్షల్లో విద్యార్థులు మంచి మార్కులు సాధించారు. ప్రైవేట్ పాఠశాలలు ఆడమ్స్, శ్రీవిజ్ఞాన్ పాఠశాలలతోపాటు, ప్రైవేట్ కాలేజీల్లో శ్రీవిజ్ఞాన్, వడ్డాది పిఎన్ఎమ్ పాఠశాల ఈ ఏడాది ఉత్తమ ఫలితాలు సాధించాయి.

నర్సీపట్నంటౌన్:

పట్టణంలో పలు కళాశాలలు, పాఠశాలలు విద్యాభివృద్ధిలో ఆదర్శంగా నిలుస్తున్నాయి పట్టణంలో శ్రీవిద్యాంజలి, అమరావతి విద్యాసంస్థలు, కారుణ్య హైస్కూలు, స్టాన్ఫోర్డ్ స్కూల్ , లిటిల్ ఏంజెల్స్ స్కూల్, మినర్వా, కెన్ విన్ స్కూల్, శ్రీనివాస ఐటిఐ, భూషణ్ ఐటిఐ, మదర్ నర్సింగ్ హోమ్, బి ఆర్ కాలేజ్, రిషి వాలీ కళాశాల, ఆదిత్య స్కూలు, అవంతి ఇంజనీరింగ్ కళాశాల, ఇమ్మానియేల్ విద్యాసంస్థలు, కార్పొరేట్ విద్యా సంస్థలైన భాష్యం, చైతన్య, నారాయణ విద్యాసంస్థలు ఉన్నాయి. సాంకేతిక విద్యా సంస్థలైన ప్రభుత్వ పాలిటెక్నిక్, ప్రభుత్వ ఐటిఐ, ప్రయివేటు ఐటిఐ ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. వీటితోపాటు పోటీ పరీక్షలకు అవసరమైన కోచింగ్ సెంటర్లు కూడా నర్సీపట్నంలో ఉన్నాయి. అభ్యాస ఫలితాలు, విజ్ఞానం మొదలైనవాటిలో అత్యుత్తమ ప్రదర్శన ఇస్తున్నాయి. ఇతర ప్రాంతాలకు వెళ్లకుండా పట్టణంలో పలు పాఠశాలలు ఉత్తమ విద్యార బోధనను అందిస్తున్నాయి.